




# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు








| సంపుటి : 1 సంచిక :122 పేజీలు :8 | సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) | ప్రచురణ : తిరుపతి | ఆదివారం 17 మే 2026 | వెల : 5/-రూ ॥ |
|---|---|---|---|---|
| VOLUME :1 ISSUE :122 PAGES :8 | EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) | PUBLISHED : TIRUPATI | SUN 17 MAY 2026 | PRICE : 5/- RS |

Simultaneously Published form Tirupati, Chittoor,Srikakulam,Ongole,Visakhapatnam,Kakinada,West Godavari,Bapatla,Narasarao Peta, Ongole, SPSR Nellore, Tirupati, YSR Kadapa,Circulated by : manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur,Kurnool,Anantapur




## విదేశాల్లో ఉన్న విషయాన్ని మర్చిపోయా.. సొంత దేశంలో ఉత్సవానికి హాజరైనట్టుగా ఉంది

- నెదర్లాండ్స్ లోని ది హేగ్ లో ప్రవాస భారతీయుల ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన మోదీ
- ఆర్థిక, సాంకేతిక రంగాలలో భారత్ వేగంగా అభివృద్ధి చెందుతోందని వ్యాఖ్య
- సెమీకండక్టర్ల తయారీ రంగంలో వేగంగా ముందడుగు వేస్తున్నామన్న ప్రధాని

పెన్ పవర్ డెస్క్:భారతదేశం ప్రస్తుతం ఆర్థిక, సాంకేతిక రంగాలలో ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతోందని ప్రధాని మోదీ అన్నారు. నెదర్లాండ్స్ పర్యటనలో భాగంగా 'ది హేగ్' నగరంలో ఏర్పాటు చేసిన ప్రవాస భారతీయుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా దేశం సాధిస్తున్న

- మిగతా 2లో

## నా జీవితాశయం ఇదే.. ఈ నాలుగు కార్యక్రమాలే నా ప్రాధాన్యం



- పరిశుభ్రత, పేదరిక నిర్మూలన, జనాభా పెరుగుదల, భూ రికార్డుల ప్రక్షాళనే తన ప్రాధాన్యతలని స్పష్టం చేసిన సీఎం
- రాష్ట్రవ్యాప్తంగా 'ఆపరేషన్ క్లీన్ స్వీప్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన చంద్రబాబు
- ఉత్తరాంధ్ర నుంచి వలసలు పోవద్దు, ఉత్తరాంధ్రకే వలసలు రావాలన్నదే తన సంకల్పమని వెల్లడి
- గత ప్రభుత్వ పాలనను 'గొడ్డలి పార్టీ'గా అభివర్ణిస్తూ, విధ్వంసానికి, అభివృద్ధికి ఉన్న తేడాను గమనించాలని ప్రజలకు పిలుపు
- నరసన్నపేట నియోజకవర్గానికి పలు అభివృద్ధి పనులను మంజూరు చేస్తూ వేదికపై నుంచే హామీ

- మిగతా 2లో

## "బాదంపప్పు - అప్పూ" గేమ్...

- తాడేపల్లిగూడెంలో ఫిర్యాదుల ఫిక్సింగ్ నెట్‌వర్క్..?
- డీఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు ఇస్తే... ముందుగా అప్పూ చేతుల్లోకేనా..?
- డీఎస్పీని కలిసేలోపే కంప్లైంట్ కథను మార్చేస్తున్నది ఎవరు..?
- బాధితుడు బయటకు వెళ్లగానే బాదంపప్పుకు వెళ్లే సీక్రెట్ కాల్స్ ఏంటి..?
- 'ఇంకో రెండు ఎక్స్‌ట్రా' అంటూ మొదలయ్యే కొత్త సెటిల్మెంట్ ఫార్ములా..?
- విశాఖలో విల్లా కలలు... అప్పూ ఆస్తులపై కొత్త చర్చ..!
- పప్పు-అప్పూ గేమ్‌పై పోలీస్ బాస్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారు..?

పోలీస్ స్టేషన్‌లో ఒకరు... డీఎస్పీ కార్యాలయంలో మరొకరు... ఇద్దరి మధ్య సమన్వయం ఉంటే సామాన్య బాధితుడి పరిస్థితి ఎలా ఉంటుందో తాడేపల్లిగూడెంలో ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఫీల్డ్‌లో వ్యవహారాలు నడిపించే "బాదంపప్పు"... డీఎస్పీ ఆఫీస్‌లో ఫిర్యాదుల ప్రవాహాన్ని కంట్రోల్ చేసే "అప్పూ"... ఈ ఇద్దరి పేర్లు ఇప్పుడు స్థానికంగా తీవ్ర చర్చకు దారి తీస్తున్నాయి. బాధితులు చెబుతున్న వర్షన్ ఆధారంగా పెన్ పవర్ పరిశీలనలో ఆసక్తికర అంశాలు వెలుగులోకి వస్తున్నాయి.

ఎడిటర్, పెన్ పవర్ భీమవరం/ తాడేపల్లిగూడెం, మే 16:

వివరాలు 2లో..




## పవన్ పార్టీ పెట్టింది సీఎం అవ్వడనికి కాదు.. ఆ విషయం మాకు ఎప్పుడో తెలుసు

పెన్ పవర్ డెస్క్:జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై వైసీపీ నేత అంబటి రాంబాబు ఘాటు విమర్శలు చేశారు. పవన్ తన పార్టీని సీఎం అవ్వడానికి పెట్టలేదని,

- మిగతా 2లో



## పార్టీలో ఉండాలనుకునే వారు ఉండొచ్చు.. వద్దనుకుంటే వెళ్ళవచ్చు

- టీఎంసీ నుంచి పోటీ చేసిన అభ్యర్థులతో మమతా బెనర్జీ భేటీ
- పార్టీ తిరిగి పుంజుకుంటుందని మమతా బెనర్జీ ధీమా
- టీఎంసీ ఎప్పటికీ తలవంచదన్న మమతా బెనర్జీ



పెన్ పవర్ డెస్క్:పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నిక ల ఫలితాల తర్వాత, తృణమూల్ కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విబేధాలు తలెత్తాయనే ఊహాగా నాలు వినిపించాయి. ఈ నేపథ్యంలో మాజీ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ పార్టీ అధినేత్రి మమతా బెనర్జీ కీలక వ్యాఖ్యలు చేశారని తెలుస్తోంది. పార్టీలో ఉండాలనుకునే వారు ఉండవచ్చని, వద్దనుకునే వాళ్ళు వెళ్ళిపోవచ్చని ఆమె స్పష్టంగా చెప్పినట్లు టీఎంసీ వర్గాలు వెల్లడించాయి.ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో టీఎంసీ పార్టీ తరఫున పోటీ చేసిన అభ్యర్థులతో కాళీఘాట్‌లోని తన నివాసంలో మమతా

- మిగతా 2లో

## ఘోర రోడ్డు ప్రమాదంలో నలుగురు మహిళలు దుర్మరణం.. నారా లోకేష్ దిగ్భ్రాంతి

- కాకినాడ పరిధిలోని కొవ్వూరు బ్రిడ్జి సమీపంలో ప్రమాదం
- రోడ్డు దాటుతున్న మహిళలను ఢీకొట్టిన టిప్పర్
- అక్కడికక్కడే నలుగురు మహిళలు దుర్మరణం
- వాహనాన్ని వదిలేసి పరారైన డ్రైవర్
- మహిళల మృతి తనను కలచివేసిందన్న లోకేష్

పెన్ పవర్ డెస్క్:కాకినాడ రూరల్ పరిధిలోని కొవ్వూరు బ్రిడ్జి సమీపంలో ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. చీడగ గ్రామానికి చెందిన కొందరు మహిళా కూలీలు ఉపాధి హామీ పనుల కోసం కాలినడకన రోడ్డు దాటుతుండగా, కాకినాడ వైపు నుంచి అత్యంత వేగంగా, నిర్లక్ష్యంగా దూసుకొచ్చిన ఒక టిప్పర్ లారీ వారిని బలంగా ఢీకొట్టింది. ఈ ఘోర ప్రమాదంలో తీవ్ర రక్తస్రావమై సత్యవతి, కృష్ణవేణి, చిట్టెమ్మ, అన్నవరం అనే నలుగురు మహిళా కూలీలు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. ప్రమాదం జరిగిన వెంటనే టిప్పర్ లారీ డ్రైవర్ వాహనాన్ని అక్కడే వదిలేసి పరారయ్యాడు.ఈ ఘోర రోడ్డు ప్రమాద



ఘటనపై రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పొట్టకూటి కోసం

- మిగతా 2లో



## నా వ్యాఖ్యలను వక్రీకరించారు

- నకిలీ, బోగస్ డిగ్రీలతో వృత్తిలోకి ప్రవేశించే వారిని ఉద్దేశించి వ్యాఖ్యానించినట్లు వెల్లడి
- కొందరు తన వ్యాఖ్యలను వక్రీకరించారని ఆవేదన
- భారత యువత పట్ల తాను గర్వపడుతున్నానన్న జస్టిస్ సూర్యకాంత్

- మిగతా 2లో

## తమిళనాడు సీఎం వద్ద హోం, యువజన సంక్షేమం.. మంత్రులకు శాఖల కేటాయింపు



- మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ వాటర్ సప్లై శాఖలను అట్టిపెట్టుకున్న సీఎం
- ఎన్.ఆనంద్‌కు గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ కేటాయింపు
- అదవ అర్జునకు పబ్లిక్ వర్క్స్, క్రీడల అభివృద్ధి శాఖలు

పెన్ పవర్ డెస్క్:తమిళనాడు ముఖ్యమంత్రికి, ఇతర మంత్రులకు శాఖలను కేటాయిస్తూ లోక్ భవన్ శనివారం ప్రకటన విడుదల చేసింది. విజయ్ ముఖ్యమంత్రిగా ఈ నెల 10వ తేదీన ప్రమాణ స్వీకారం చేసిన విషయం తెలిసిందే. ఆయనతో పాటు మరో తొమ్మిది మంది మంత్రులుగా ప్రమాణం చేశారు. విజయ్ సిఫార్సు మేరకు మంత్రులకు లోక్ భవన్ శాఖలను కేటాయించింది. ముఖ్యమంత్రి విజయ్ తన వద్ద హోం, పోలీస్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, మహిళా సంక్షేమం, యువజన సంక్షేమం, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ వాటర్ సప్లై శాఖలను అట్టిపెట్టుకున్నారు. గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్, పేదరిక నిర్మూలన, నీటిపారుదల ప్రాజెక్టుల శాఖలను ఎన్.ఆనంద్‌కు... పబ్లిక్ వర్క్స్, హైవేస్, మైనర్ పోర్ట్స్, క్రీడల అభివృద్ధి శాఖలను

- మిగతా 2లో



## పెట్రోల్, డీజిల్ ధరలు లీటర్‌కు రూ.10 పెరిగే అవకాశం!

- మొన్న లీటర్‌పై రూ.3 పెంపు
- సమీప భవిష్యత్తులో మరింత పెరిగే అవకాశం
- దశలవారీగా రూ.10 పెంచే అవకాశం

- మిగతా 2లో

# ఎడిటర్ వ్యూ

## పెట్రోల్, డీజిల్ ధరలు లీటర్‌కు రూ.10 పెరిగే అవకాశం!

భారతదేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు లీటర్ పైన రూ.10 వరకు పెరిగే అవకాశముందని ఎంకే గ్లోబల్ విశ్లేషకులు పేర్కొన్నారు. అయితే ఈ పెంపు ఒకేసారి లేదా దశలవారీగా ఉండవచ్చని అభిప్రాయపడ్డారు. లీటర్ పెట్రోల్, డీజిల్‌పై సగటున రూ.3 పెంచుతూ శుక్రవారం భారత చమురు రంగ కంపెనీలు నిర్ణయించాయి. సమీప భవిష్యత్తులో ఈ ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని ఆర్థికవేత్తలు హెచ్చరిస్తున్నారు.

పశ్చిమాసియాలో ఉద్రిక్తత కారణంగా రాబోయే రోజుల్లో అంతర్జాతీయంగా ఇంధన ధరలు భారీగా పెరగవచ్చని అంచనా వేస్తున్నారు. ఈ క్రమంలో చమురు కంపెనీలు ప్రస్తుతం ఎదుర్కొంటున్న ఆర్థిక నష్టాల నుంచి బయటపడేందుకు రూ.3 పెంచాయని, కానీ ఈ పెంపు చాలదని ఎంకే గ్లోబల్ విశ్లేషకులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రెండు మూడు వారాల్లో దశలవారీగా పెరుగుదల ఉండవచ్చని అన్నారు.అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరలు విపరీతంగా పెరిగాయి. దీంతో ధరల పెరుగుదలను నియంత్రించడానికి కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకం వసూలును దాదాపు నిలిపివేసింది. ప్రభుత్వరంగ చమురు కంపెనీలు కూడా లాభాలను వదులుకుని అధిక వ్యయాన్ని భరించాయి. ఇలాంటి పరిస్థితుల్లో కంపెనీలు ఇంధన ధరలు పెంచుతున్నాయి. నిన్న పెరిగిన స్వల్ప పెరుగుదల కూడా కంపెనీల రోజువారీ నష్టాలను కొంతమేర తగ్గించిందే తప్ప తొలగించలేదు.

## పార్టీలో ఉండాలనుకునే వారు ఉండొచ్చు.. వద్దనుకుంటే వెళ్ళవచ్చు

- మొదటి పేజి తరువాయి

బెనర్జీ సమావేశమయ్యారు. ఈ సమావేశంలో టీఎంసీ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ కూడా పాల్గొన్నారు.ఈ సందర్భంగా మమతా బెనర్జీ మాట్లాడుతూ, ఎన్నికల్లో ఓటమి పాలైనప్పటికీ పార్టీ తిరిగి పుంజుకుంటుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీ మారాలనుకునే వారిని వెళ్ళనీయండని, కానీ పార్టీని కొత్తగా నిర్మిస్తానని ధీమా వ్యక్తం చేశారు. దెబ్బతిన్న పార్టీ కార్యాలయాలను పునర్నిర్మించాలని సూచించారు. వాటికి రంగులు వేద్దామని, అవసరమైతే తాను కూడా వేస్తానని తెలిపారు. టీఎంసీ ఎప్పటికీ తలవంచదని అన్నారు. ప్రజల తీర్పును వారు దొంగిలించారని విమర్శించారు.

## నా జీవితాశయం ఇదే.. ఈ నాలుగు కార్యక్రమాలే నా ప్రాధాన్యం

శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటలో జరిగిన 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' ప్రజా వేదిక కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు తన ప్రభుత్వ దార్శనికతను, భవిష్యత్ ప్రణాళికలను ఆవిష్కరించారు. తన మనసుకు దగ్గరైన నాలుగు కార్యక్రమాలే రాష్ట్ర భవిష్యత్తుకు మూలస్తంభాలని ఆయన పునరుద్ఘాటించారు. రాష్ట్రాన్ని పరిశుభ్రంగా మార్చే 'స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర', పేదలకు అండగా నిలిచే సంక్షేమ పథకాలు, జనాభా సమతుల్యత, భూ రికార్డుల ప్రక్షాళన తన జీవితాశయమని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా 'ఆపరేషన్ క్లీన్ స్వీప్' అనే కొత్త కార్యక్రమాన్ని ప్రారంభించి, రాష్ట్రాన్ని చెత్త రహితంగా మార్చే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని హామీ ఇచ్చారు.

**నా జీవితాశయం ఇదే.. నాలుగు కార్యక్రమాలే నా ప్రాధాన్యం**

ప్రజల అభిమానాన్ని చూస్తుంటే ఎంత కష్టపడినా తక్కువేననిపిస్తోందని చంద్రబాబు తన ప్రసంగాన్ని ప్రారంభించారు. "నా మనసుకు దగ్గరైన నాలుగు కార్యక్రమాలు ఉన్నాయి. మొదటిది రాష్ట్రాన్ని పరిశుభ్రంగా ఉంచే స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర. రెండోది నెల మొదటి తారీఖున పేదలకు పింఛన్లు అందించి వారి బాగోగులు తెలుసుకోవడం. మూడోది జనాభా నియంత్రణ పేరుతో గతంలో జరిగిన పొరపాటును సరిదిద్ది, పిల్లల్ని సంపదగా భావించడం. అందుకే మూడో బిడ్డకు రూ.30,000, నాలుగో బిడ్డకు రూ.40,000 అందిస్తున్నాం. నాలుగోది, గొడ్డలి పార్టీ నాశనం చేసిన భూ రికార్డులను బ్లాక్‌చైన్ టెక్నాలజీతో ప్రక్షాళన చేసి, 2027 మార్చి నాటికి భూతగాదాలు లేని రాష్ట్రంగా మార్చడం" అని తన లక్ష్యాలను వివరించారు.

**స్వచ్ఛాంధ్ర ఉద్యమం.. 'ఆపరేషన్ క్లీన్ స్వీప్' ప్రారంభం**

స్వచ్ఛాంధ్ర కార్యక్రమం 17వ సారి నిర్వహిస్తున్నామని, దీని ద్వారా రాష్ట్రంలో మార్పు కనిపిస్తోందని చంద్రబాబు అన్నారు. "స్వచ్ఛత అంటే రోడ్లు, ఇళ్లు శుభ్రంగా ఉండటమే కాదు, మన ఆలోచనలు కూడా స్వచ్ఛంగా ఉండాలి. గత ఐదేళ్లలో రాష్ట్రంలో పేరుకుపోయిన 86 లక్షల మెట్రిక్ టన్నుల లెగసీ వేస్ట్‌ను క్లియర్ చేయడానికి 23 నెలలు పట్టింది. జూన్ నాటికి రాష్ట్రంలో ఎక్కడా చెత్త లేకుండా చేసే బాధ్యత మాది" అని హామీ ఇచ్చారు.

చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసే ప్లాంట్లు, వ్యర్థాల సేకరణకు 'స్వచ్ఛ రథం', పాఠశాలల్లో 'నెట్ జీరో' విధానం వంటి కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా నెల రోజుల పాటు 'ఆపరేషన్ క్లీన్ స్వీప్' కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు.

**ఉత్తరాంధ్ర నుంచి వలసలు కాదు.. ఉత్తరాంధ్రకే వలసలు రావాలి**

ఉత్తరాంధ్ర అభివృద్ధిపై చంద్రబాబు ప్రత్యేకంగా దృష్టి సారించారు. "ఒకప్పుడు దేశంలో ఏ నగరానికి వెళ్లినా శ్రీకాకుళం కాలనీ ఉండేది. ఈ పరిస్థితి మారాలి. ఉత్తరాంధ్ర నుంచి వలసలు పోవడం కాదు, ఉత్తరాంధ్రకే వలసలు రావాలి. ఇదే నా సంకల్పం" అని ఆయన స్పష్టం చేశారు. భోగాపురం ఎయిర్‌పోర్ట్, మూలపేట పోర్ట్, డేటా సెంటర్లు, ఐటీ కంపెనీలతో ఉత్తరాంధ్ర దశ, దిశ మారుతోందన్నారు. పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులైన మధ్యవలస స్టేజ్-2, హీరమండలం ఎత్తిపోతల, వంశధార, జంఝావతి ప్రాజెక్టులను నిర్ణీత గడువులోగా పూర్తి చేస్తామని క్యాలెండర్ ప్రకటించారు. 60 ఏళ్ల కల అయిన నేరేడి బ్యారేజ్‌ను ఈ ప్రభుత్వ హయాంలోనే పూర్తి చేసి చూపిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

**అవార్డుల అభినందనలు.. నరసన్నపేటకు వరాలు**

జాతీయ స్థాయిలో ఉత్తమ పంచాయతీలుగా నిలిచి అవార్డులు సాధించిన అధికారులను, ప్రజాప్రతినిధులను చంద్రబాబు వేదికపై నుంచి అభినందించారు. దేశంలోనే 8 అవార్డులు సాధించి పంచాయతీరాజ్ శాఖ నంబర్ వన్‌గా నిలిచిందని కొనియాడారు. ఇదే స్ఫూర్తితో పనిచేయాలని సూచించారు. స్థానిక ఎమ్మెల్యే రమణమూర్తి విజ్ఞప్తి మేరకు, నరసన్నపేటలోని రాజుల చెరువు ఆధునికీకరణ, ఓల్డ్ ఎన్హెచ్ రోడ్డు విస్తరణ, శ్రీముఖలింగం ఆలయ ఉత్సవాలను రాష్ట్ర పండుగగా నిర్వహించడం వంటి పలు అభివృద్ధి పనులకు అక్కడికక్కడే ఆమోదం తెలిపారు. ఎర్రన్నాయుడు పార్క్ కేసును పరిష్కరించే బాధ్యతను కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకు అప్పగించారు.

**లెక్కలతోనే నా పాలన.. అధికారులకు మార్కులు, క్లాసులు**

తన ప్రసంగంలో భాగంగా ముఖ్యమంత్రి, శ్రీకాకుళం జిల్లా అధికారుల పనితీరుపై డేటాతో సహా సమీక్ష నిర్వహించారు. "50 ప్రభుత్వ సేవలపై ప్రజల సంతృప్తి రాష్ట్ర సగటు 72.96% ఉండగా, శ్రీకాకుళం జిల్లాలో 75.2% ఉండటం అభినందనీయం" అని కలెక్టర్‌ను, అధికార యంత్రాంగాన్ని ప్రశంసించారు. రీ-సర్వే, తాగునీరు, బీసీ వెల్ఫేర్ హాస్టల్స్ వంటి విభాగాల్లో మెరుగైన పనితీరు కనబరిచిన వారిని అభినందిస్తూనే, ఆర్టీసీ బస్ సర్వీసులు, గంజాయి నియంత్రణ, సీఎం రిలీఫ్ ఫండ్ అమలులో వెనుకబడిన శాఖల అధికారులను హెచ్చరించారు. పనితీరు మెరుగుపరుచుకోవాలని, ప్రజలకు జవాబుదారీగా ఉండాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

**గొడ్డలి పార్టీతో జాగ్రత్త.. విధ్వంసం, అభివృద్ధికి తేడా ఇదే**

గత ప్రభుత్వ పాలనను 'గొడ్డలి పార్టీ'గా అభివర్ణిస్తూ చంద్రబాబు తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. "అధికారం అంటే విధ్వంసం కాదు, ప్రజల జీవితాలను మార్చే అవకాశం. గత ఐదేళ్లు ప్రభుత్వ టెర్రరిజం, కబ్జాలు, అరాచకాలతో ఉత్తరాంధ్ర అభివృద్ధి కుంటుపడింది. బాబాయ్‌ని గొడ్డలితో చంపి, ఆ నింద నాపై వేసి ఎన్నికల్లో గెలిచారు. అలాంటి వారి కొత్త నాటకాలతో మళ్లీ వస్తారు, జాగ్రత్తగా ఉండాలి" అని ప్రజలను హెచ్చరించారు. విధ్వంసానికి, అభివృద్ధికి మధ్య ఉన్న తేడాను గమనించి, రాష్ట్ర భవిష్యత్తు కోసం అభివృద్ధికి అండగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు.

# "బాదంపప్పు - అప్పూ" గేమ్...

- మొదటి పేజి తరువాయి

ఉదయం 10 గంటలు... డీఎస్పీ కార్యాలయంలో అసలు సీన్ ఇదేనా..? ఒక బాధితుడు చేతిలో ఫిర్యాదు పత్రం పట్టుకుని డీఎస్పీ కార్యాలయానికి చేరుకుంటాడు.

"సార్... ఫలానా ఎస్సై మమ్మల్ని తీవ్రంగా ఇబ్బంది పెడుతున్నాడు... డీఎస్పీ గారిని కలిసి ఫిర్యాదు ఇవ్వాలి..." అని చెప్పగానే... అక్కడే ఉన్న అప్పూ రంగంలోకి దిగుతాడని సమాచారం. "డీఎస్పీ గారు లేరు... మీ కంప్లైంట్ నాకు ఇవ్వండి... రాగానే పెడతాను... మీకు నేను ఫోన్ చేస్తాను..." అంటూ నమ్మకం కలిగిస్తాడని బాధితులు చెబుతున్నట్టు సమాచారం. అమాయక ప్రజలు కూడా నమ్మి ఫిర్యాదు పత్రాన్ని అప్పగించి వెనుదిరుగుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**డీఎస్పీ ఉన్నా... వ్యవహారం అప్పూ చేతుల్లోనేనా..?**

కొన్ని సందర్భాల్లో డీఎస్పీ కార్యాలయంలో ఉన్నతాధికారి ఉన్నప్పటికీ... ముందుగా అప్పూ వెళ్లి పరిస్థితిని వివరించేస్తాడని ఆరోపణలు ఉన్నాయి. బాధితుడు ఏం చెబుతాడు...? ఎలా స్పందించాలి...? ఎంత వరకు వినాలి...? అన్న అంశాలపై ముందుగానే "ఫీడ్" ఇస్తాడన్న ప్రచారం స్థానికంగా వినిపిస్తోంది.

**ఏళ్ల తరబడి ఒకేచోటే డ్యూటీ... అందుకేనా అండదండలు..?**

తాడేపల్లిగూడెంలో సంవత్సరాలుగా పాతుకుపోయిన కొందరు పోలీసు సిబ్బందిని... ఒకసారి స్పెషల్ బ్రాంచ్‌లోకి, మరోసారి ఇంటెలిజెన్స్ విభాగాల్లోకి తీసుకోవడం వల్ల... తాడేపల్లిగూడెంలో జరిగే అనేక వ్యవహారాలు ఇంతకముందు ఇక్కడే డిపార్ట్మెంట్ లో పనిచేసి ప్రస్తుతం స్పెషల్ బ్రాంచ్ సిబ్బందిగా.. ఇంటిలిజెన్స్ సిబ్బందిగా... ఉన్నవారికి సుపరిచితమేనని, ప్రస్తుతం తాడేపల్లిగూడెం డిపార్ట్మెంట్ లో జరిగే వ్యవహారాలు పైస్థాయి అధికారుల దృష్టికి పూర్తిగా వెళ్లడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్థానికంగా బలమైన నెట్‌వర్క్ ఏర్పరుచుకున్న ఈ వర్గం... స్టేషన్ల స్థాయిలో జరిగే వ్యవహారాలను తమకు అనుకూలంగా మలుచుకుంటోందన్న చర్చ నడుస్తోంది. ఇంకా షాకింగ్ అంశం ఏమిటంటే... తాడేపల్లిగూడెంలో ఏ రైడింగ్ జరిగిన ఈ రెండు శాఖలకు చెందిన సిబ్బందికి కొంత మొత్తం వెళుతుందని విశ్వాస సమాచారం... ఇలా గూడెం లో ఉన్న స్టేషన్ల నుంచి నెలవారీ మామూల్లు కూడా అందుతున్నాయన్న విశ్వసనీయ సమాచారం బయటకు వస్తోంది. అందుకే

**"ఫిర్యాదులు పైకి వెళ్లకుండా ఫిల్టర్ అవుతున్నాయాని..?**

పై అధికారులకు చేరకుండా మధ్యలోనే కథ ముగుస్తుందన్న ప్రశ్నలు ఇప్పుడు తాడేపల్లిగూడెంలో హాట్ టాపిక్‌గా మారాయి.




**ఇక మన పప్పూ దగ్గరికి వస్తే...**

బాధితులు బయటకు వెళ్లగానే... బాదం పప్పుకు కాల్..?

ఫిర్యాదు ఇచ్చిన వ్యక్తి వెళ్లిపోయిన వెంటనే... అప్పూ నుంచి ఫీల్డ్‌లో ఉన్న బాదం పప్పుకు సమాచారం వెళ్తుందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. "వాళ్లు ఇక్కడికి వచ్చారు..." "ఏం కంప్లైంట్ ఇచ్చారు..." "ఇప్పుడు ఎలా హ్యాండిల్ చేయాలో చూడు..." అంటూ సంభాషణలు జరుగుతున్నాయన్న ప్రచారం ఉంది.

**ఇంకో రెండు ఎక్స్‌ట్రా' ఫార్ములా..?**

ఇప్పటికే సమస్యతో ఇబ్బంది పడుతున్న బాధితుడికి... "ఇంకో రెండు పెంచండి..." "అప్పుడే విషయం సెటిల్ అవుతుంది..." అంటూ అదనపు డిమాండ్లు వస్తున్నాయన్న ఆరోపణలు స్థానికంగా హాట్ టాపిక్‌గా మారాయి. బాధితుడి కథ అక్కడే మొదలు ఒకసారి ఈ వలయంలో చిక్కుకున్న తర్వాత... ఎప్పుడు సమస్య ముగుస్తుందో తెలియదు ఎంత ఖర్చవుతుందో తెలియదు ఎవరిని కలవాలో అర్థం కాదు చివరికి బాధితుడు పూర్తిగా మానసికంగా, ఆర్థికంగా నష్టపోతున్నాడన్న వాదనలు వినిపిస్తున్నాయి.

**విశాఖలో విల్లా కలలు..? గూడెం లో బడా ఫ్లాట్..?**

ఈ వ్యవహారాల ద్వారా వచ్చిన డబ్బుతో... అప్పూ తన అత్తగారి ప్రాంతమైన విశాఖలో ఓ బారీ గృహ నిర్మాణం కు ప్లాన్ చేశాడని... అక్కడ ప్రస్తుతం పనులు జరుగుతున్నాయన్న విశ్వసనీయ సమాచారం స్థానికంగా చర్చకు దారి తీస్తోంది.? అలాగే తాడేపల్లి గూడెం లో సుమారు 50 లక్షలు విలువ చేసే టూ బెడ్ రూమ్ ఫ్లాట్ కొనుగోలు చేస్తున్నట్లు సమాచారం..? పై రెండు నిర్మాణాలు ఒక కానిస్టేబుల్ స్థాయి ఉద్యోగి చేయగలడా... అంటే అది సాధారణ కానిస్టేబుల్ లకు... మాత్రం జీవితం మొత్తం ఉద్యోగం చేసిన ఒక నిర్మాణం కూడా చేసుకోలేరు... కానీ మన అప్పు మాత్రం అలగ్... ప్రస్తుతం అయితే ఈ ఆరోపణలపై అధికారికంగా ఎలాంటి స్పందన రావాల్సి ఉంది.

**పోలీస్ బాస్ ల స్పందన ఏంటి..?**

ఈ వ్యవహారాలపై ఉన్నతాధికారులు ఇప్పటికే సమాచారం సేకరిస్తున్నారా..? అప్పూ పాత్రపై ఎలాంటి చర్యలు ఉంటాయి..? అన్నది ఇప్పుడు ఆసక్తికర అంశంగా మారింది.

పెన్ పవర్ నెక్స్ట్ ఎపిసోడ్‌లో... ఈ "బాదం పప్పు -- అప్పూ" వ్యవస్థ వెనుక రాజకీయ లింకులు ఎవరు..? ఎవరు రక్షణ కవచంగా ఉన్నారు..?

**మరిన్ని సంచలన విషయాలతో ఎపిసోడ్ -- 4 త్వరలో...**

## మోదీ పొదుపు పిలుపు.. మహానాడును ఆన్‌లైన్ పద్ధతిలో నిర్వహిస్తున్నామన్న కొల్లు రవీంద్ర

- మొదటి పేజి తరువాయి

నిర్ణయించారని రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడించారు. అంతర్జాతీయంగా నెలకొన్న యుద్ధ ప్రభావం వల్ల దేశవ్యాప్తంగా ఏర్పడిన విపత్కర పరిస్థితులు, ఇంధన సంక్షోభాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ పొదుపు చర్యలకు శ్రీకారం చుట్టినట్లు ఆయన స్పష్టం చేశారు.నెల్లూరు వేదికగా భారీ ఎత్తున జరగాల్సిన మహానాడు కార్యక్రమాన్ని, ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయానికి పరిమితం చేశారు. అక్కడి నుంచే పొలిట్‌బ్యూరో సభ్యులు, ముఖ్య నేతల సమక్షంలో ఆన్‌లైన్ ద్వారా ఈ వేడుకలు జరగనున్నాయి. అయితే కేడర్‌కు ఎటువంటి నిరాశ కలగకుండా, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 175 నియోజకవర్గాల్లో క్లస్టర్ల వారీగా పెద్ద స్క్రీన్లను ఏర్పాటు చేసి డిజిటల్ పద్ధతిలో అందరినీ భాగస్వామ్యం చేయనున్నారు. మహానాడు తీర్మానాలు, పార్టీ భవిష్యత్తు కార్యాచరణను ఈ స్క్రీన్ల ద్వారానే నాయకులకు, కార్యకర్తలకు చేరవేస్తారు.ఇదే సమయంలో ఇంధన కొరతను ఆసరాగా చేసుకుని మార్కెట్లో నిత్యావసర సరుకుల ధరలను పెంచితే సహించేది లేదని కొల్లు రవీంద్ర వ్యాపారులను హెచ్చరించారు. కృత్రిమ కొరత సృష్టించి ఎక్కువ ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు. ప్రజలు ఎలాంటి అభద్రతా భావానికి గురికావాల్సిన అవసరం లేదని, ధరలను అదుపు చేయడానికి ముఖ్యమంత్రి ఇప్పటికే ఒక ప్రత్యేక కమిటీని నియమించారని తెలిపారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ నేతృత్వంలో పనిచేస్తున్న ఈ కమిటీ, రాష్ట్రవ్యాప్తంగా మార్కెట్ ధరలను నిరంతరం పర్యవేక్షిస్తుందని మంత్రి స్పష్టం చేశారు.

### ఘోర రోడ్డు ప్రమాదంలో నలుగురు మహిళలు దుర్మరణం..

## నారా లోకేష్ దిగ్భ్రాంతి

- మొదటి పేజి తరువాయి

ఉదయాన్నే ఉపాధి పనులకు వెళుతూ నలుగురు మహిళా కార్మికులు ఇలా దుర్మరణం పాలవ్వడం తనను ఎంతగానో కలచివేసిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మృతుల కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేసిన మంత్రి, కూటమి ప్రభుత్వం బాధిత కుటుంబాలకు అన్ని విధాలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మరో ఇద్దరు కూలీలను కాకినాడ సర్వజనాస్పత్రికి తరలించగా, వారికి మెరుగైన అత్యవసర వైద్యం అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. కాగా, ఈ ఘటనపై కేసు నమోదు చేసిన కాకినాడ రూరల్ పోలీసులు పరారైన లారీ డ్రైవర్ కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

## పవన్ పార్టీ పెట్టింది సీఎం అవ్వడానికి కాదు.. ఆ విషయం మాకు ఎప్పుడో తెలుసు

- మొదటి పేజి తరువాయి

మరొకరిని సీఎం చేయడానికి పెట్టారని తమకు ఎప్పటినుంచో తెలుసంటూ ఎద్దేవా చేశారు. పవన్ కళ్యాణ్ ఇటీవల చేసిన వ్యాఖ్యలకు కౌంటర్‌గా అంబటి ఈ వ్యాఖ్యలు చేశారు.తమిళ నటుడు విజయ్ ఇటీవల రాజకీయాల్లోకి వచ్చి ఒంటరిగా పోటీ చేసి గెలిచిన నేపథ్యంలో, పవన్ కూడా అలాగే గెలవాల్సిందంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న చర్చపై జనసేనాని స్పందించారు. విజయ్‌తో తనకు పోలిక లేదని, గతంలో తాను ఒంటరిగా రెండు చోట్ల పోటీ చేస్తే ప్రజలు ఓడించారని గుర్తుచేశారు. అందుకే పొత్తులతో వెళ్లాల్సి వచ్చిందని ఆయన వివరించారు.పవన్ చేసిన ఈ వ్యాఖ్యలనే అంబటి రాంబాబు ఆయుధంగా చేసుకున్నారు. "మీరు సీఎం కావాలని కాదు, ఎవరో సీఎం కావాలని పార్టీ పెట్టారని మాకు ఎప్పుడో తెలుసు. కానీ ఆ విషయం ప్రజలకు ఇప్పుడిప్పుడే అర్థమవుతోంది" అని అంబటి వ్యాఖ్యానించారు. పవన్ స్వయంగా తన ఓటమిని, పొత్తుల అవసరాన్ని అంగీకరించడంతో, ఆయన రాజకీయ లక్ష్యంపై అంబటి పరోక్షంగా విమర్శలు గుప్పించారు. ఈ వ్యాఖ్యలతో ఏపీ రాజకీయాల్లో మరోసారి మాటల యుద్ధం మొదలైంది.

## తమిళనాడు సీఎం వద్ద హోం, యువజన సంక్షేమం.. మంత్రులకు శాఖల కేటాయింపు

- మొదటి పేజి తరువాయి

ఆదవ్ అర్జునకు... ఆరోగ్యం, మెడికల్ ఎడ్యుకేషన్, ఫ్యామిలీ వెల్ఫేర్ శాఖలను డాక్టర్ కె.జి.అరుణ్ రాజ్‌కు... ఫైనాన్స్, పెన్షన్స్ శాఖల బాధ్యతలను కె.ఎ.సెంగొట్టయ్యన్‌కు అప్పగించారు. ఫుడ్ అండ్ సివిల్ సప్లైస్, కన్స్యూమర్ ప్రొటెక్షన్, ప్రైస్ కంట్రోల్ శాఖలను పి.వెంకటరమణన్‌కు కేటాయించారు. విద్యుత్, న్యాయ, జైళ్లు, అవినీతి నిరోధక శాఖలను ఆర్.నిర్మల్ కుమార్‌కు... స్కూల్ ఎడ్యుకేషన్, తమిళ అభివృద్ధి, సమాచార ప్రచార శాఖ, కల్చర్, ఫిల్మ్ టెక్నాలజీ శాఖలను రాజ్ మోహన్‌కు... మైన్స్ అండ్ మినరల్స్ శాఖను డాక్టర్ టి.కె.ప్రభుకు, ఇండస్ట్రీస్, ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ శాఖల బాధ్యతలను ఎస్.కీర్తనకు అప్పగించారు.

## నా వ్యాఖ్యలను వక్రీకరించారు

కొంతమందిని తాను పరాన్నజీవులుగా లేదా బొద్దింకలుగా పోల్చిన వివాదంపై భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ స్పందించారు. ఒక కేసు విచారణ సందర్భంగా మౌఖికంగా చేసిన వ్యాఖ్యలను తప్పుగా అర్థం చేసుకున్నారని ఆయన వివరణ ఇచ్చారు. నకిలీ, బోగస్ డిగ్రీలతో ఈ వృత్తిలోకి వచ్చేవారిని ఉద్దేశిస్తూ తాను ఆ వ్యాఖ్యలు చేశానని అన్నారు. ఇలాంటి వారే మీడియా, సోషల్ మీడియాతో పాటు ఇతర రంగాల్లోకి చొరబడ్డారని అన్నారు. అందుకే అలాంటి వారిని పరాన్నజీవులుగా పేర్కొన్నట్లు తెలిపారు. కానీ మీడియాలో కొందరు తన వ్యాఖ్యలను వక్రీకరించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.భారతీయ యువత పట్ల తాను ఎంతో గర్వపడుతున్నానని పేర్కొన్నారు. నిన్న ఓ కేసు విచారణ సందర్భంగా మౌఖికంగా చేసిన వ్యాఖ్యలను మీడియాలోని ఒక వర్గం వక్రీకరించిన తీరును చదివి తాను ఆవేదన చెందానని పేర్కొన్నారు. మన దేశ యువతను విమర్శించానని చెప్పడం పూర్తిగా నిరాధారమని అన్నారు. మన దేశ యువతను చూసి ఎంతో గర్వపడుతున్నానని పేర్కొన్నారు. తన పట్ల వారికి గౌరవ మర్యాదలు ఉన్నాయని చెప్పడంలో ఎలాంటి అతిశయోక్తి లేదని అన్నారు. యువతను దేశాభివృద్ధికి మూలస్తంభాలుగానే చూస్తానని సూర్యకాంత్ తెలిపారు.

## విదేశాల్లో ఉన్న విషయాన్ని మర్చిపోయా.. సొంత దేశంలో ఉత్సవానికి హాజరైనట్టుగా ఉంది

- మొదటి పేజి తరువాయి

డిజిటల్ ప్రగతిని, ప్రవాస భారతీయుల సేవలను ఆయన కొనియాడారు. ప్రస్తుతం డిజిటల్ చెల్లింపుల రంగంలో భారతదేశం ప్రపంచంలోనే నంబర్ వన్ స్థానంలో నిలిచిందని ప్రధాని గర్వంగా ప్రకటించారు. దేశంలో ఇప్పుడు నెలకు ఏకంగా 20 బిలియన్ డాలర్ల మేర డిజిటల్ లావాదేవీలు జరుగుతున్నాయని వెల్లడించారు. సాంకేతిక రంగంలో మన దేశం ఎంతో ప్రగతి సాధించిందని చెప్పారు. ఒకప్పుడు భారత్‌లో కేవలం 4 యూనికార్న్ స్టార్టప్ సంస్థలు మాత్రమే ఉండేవని, కానీ నేడు వాటి సంఖ్య 100కు చేరిందని గుర్తుచేశారు. భవిష్యత్తు సాంకేతికతకు అత్యంత కీలకమైన సెమీకండక్టర్ల తయారీ రంగంలోనూ భారత్ వేగంగా ముందడుగు వేస్తోందని, దానికి సంబంధించిన పనులు క్షేత్రస్థాయిలో చురుగ్గా సాగుతున్నాయని పేర్కొన్నారు.నెదర్లాండ్స్‌లో ఉన్న భారతీయుల ప్రేమ, ఉత్సాహాన్ని చూస్తుంటే తాను విదేశంలో ఉన్నాననే సంగతి మర్చిపోయానని, సొంత దేశంలో ఏదో ఉత్సవానికి హాజరైనట్లు అనిపిస్తోందని ప్రధాని భావోద్వేగానికి లోనయ్యారు. నెదర్లాండ్స్ నాయకత్వం ఎప్పుడు కలిసినా అక్కడి భారతీయ సమాజం చూపిస్తున్న ప్రతిభను, క్రమశిక్షణను ప్రశంసిస్తూనే ఉంటుందని చెప్పారు. తరాలు మారి, దేశాలు మారినా భారతీయులు తమ కుటుంబ విలువలను, సాంప్రదాయాలను ఎప్పటికీ వదులుకోలేదని కొనియాడారు. ప్రపంచంలో ఎన్నో సంస్కృతులు కాలగర్భంలో కలిసిపోయినప్పటికీ, భారతదేశ విభిన్న సంస్కృతి ఇప్పటికీ ప్రవాసుల హృదయాల్లో బలంగా సజీవంగా ఉందనడానికి ఈ సభే నిదర్శనమన్నారు.సరిగ్గా 12 ఏళ్ల క్రితం, 2014 మే 16న లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వెలువడి దేశంలో దశాబ్దాల తర్వాత ఒక సంపూర్ణ మెజారిటీ కలిగిన స్థిరమైన ప్రభుత్వం ఏర్పడిందని ప్రధాని గుర్తుచేశారు. అప్పటి నుంచి కోట్లాది మంది భారతీయులు తనపై ఉంచిన నమ్మకమే దేశాభివృద్ధి కోసం తనను ఆగనివ్వకుండా, అలసిపోనివ్వకుండా ముందుకు నడిపిస్తోందని మోదీ ఎమోషనల్ అయ్యారు.

# తుమ్మలపెంటలో సీఎం చంద్రబాబు పర్యటన ఏర్పాట్లు వేగవంతం..

### సభ ప్రాంగణాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్,ఎస్పీ,కావలి ఎమ్మెల్యే..
### అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలి : కలెక్టర్ హిమాన్షు శుక్ల..
### "మత్స్యకార సేవలో" సభను విజయవంతం చేద్దాం :ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి..






పెన్ పవర్:( స్టాఫ్ రిపోర్టర్ ) మే :16 కావలి మండలం తుమ్మలపెంట గ్రామంలో ఈనెల 19న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన నేపథ్యంలో జరుగుతున్న ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల గారు,జిల్లా ఎస్పీ డా. అజిత వేజెండ్ల,కావలి శాసనసభ్యులు కావ్య కృష్ణారెడ్డి శనివారం అన్ని శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. ముఖ్యమంత్రి పాల్గొనే "మత్స్యకార సేవలో" కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి చేపడుతున్న ఏర్పాట్లపై వారు అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా సభా ప్రాంగణం, హెలిప్యాడ్, పార్కింగ్ స్థలాలు, వీఐపీ మార్గాలు, ప్రజల రాకపోకలకు సంబంధించిన మార్గాలు,తాగునీరు,విద్యుత్, పారిశుధ్యం, వైద్య సదుపాయాలు, భద్రతా ఏర్పాట్లు తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. సభకు భారీగా ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రతి శాఖ సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సీఎం పర్యటనను ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని,ముఖ్యంగా మత్స్యకార కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజల్లో మరింత విశ్వాసం పెరిగేలా కార్యక్రమం ఉండాలని కలెక్టర్ హిమాన్షు శుక్ల తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, తాగునీటి పంపిణీ, నీడ ఏర్పాట్లు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మత్స్యకారుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. "మత్స్యకార సేవలో " కార్యక్రమం ద్వారా వేలాది మత్స్యకార కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. సీఎం సభను కావలి నియోజకవర్గ ప్రజలు పండుగలా నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారని అన్నారు. తుమ్మలపెంట గ్రామంలో ఇప్పటికే పలు అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని, సీఎం రాకతో ఈ ప్రాంతానికి మరింత గుర్తింపు వస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అధికారులు,ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సభా ప్రాంగణంలో ఏర్పాటు చేస్తున్న వేదిక పనులు, మీడియా గ్యాలరీ, కంట్రోల్ రూమ్, పోలీస్ భద్రతా ఏర్పాట్లు, అత్యవసర సేవల అందుబాటు తదితర అంశాలను కూడా కలెక్టర్, ఎమ్మెల్యే పరిశీలించారు. కార్యక్రమానికి హాజరయ్యే ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు..

# తిరుపతి గాంధీ విగ్రహం వద్ద ఉద్రిక్తత.

### -- పోలీసుల అప్రమత్తతతో తప్పిన ముప్పు.
### -- అధికార పార్టీ ప్రతిపక్ష పార్టీ నాయకుల మధ్య హోరెత్తిన నినాదాలు.






తిరుపతి క్రైమ్ బ్యూరో,పెన్ పవర్,ఏప్రిల్ 16. తిరుపతి ఆర్టీసీ బస్టాండ్ ఎదుట ఉన్న అంబేద్కర్ కూడలి వద్ద అధికార పార్టీ కూటమి నాయకులు మహిళలు చేరుకొని మత్తుకు వ్యతిరేకంగా ఫ్లెక్సీలు పెట్టుకొని నినాదాలు చేశారు. అనంతరం పెద్ద ఎత్తున ర్యాలీతో ఈస్ట్ పోలీస్ స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇదే క్రమంలో తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్ ఎదురుగానున్న గాంధీ విగ్రహం వద్ద మహిళను కించపరిచే విధంగా టిడిపి నాయకులు మాట్లాడారని వైసీపీ మహిళా నాయకులు పెద్ద ఎత్తున చేరుకొని ధర్నా నిర్వహిస్తున్నారు. కారు కూతల కూస్తే నాలుక కోస్తాం రౌడీయిజం నశించాలి ఆడవారిపై అసభ్య వ్యాఖ్యలు చేస్తే గుణపాఠం చెబుతామంటూ నిదాదాలతో ఫ్లెక్సీలు చేత పట్టుకుని నిరసన తెలిపారు. అధికారపక్షం కూటమి నాయకులు అక్కడికి చేరుకోవడంతో వైసిపి కూటమి నాయకుల మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొంది. వైసీపీ నాయకులు జై జగన్ అంటే కూటమి నాయకులు జై చంద్రబాబు జై లోకేష్ అంటూ నినాదాలు చేశారు ఒకరిపై మరొకరు దూషణలకు దిగారు పోలీసుల అప్రమత్తతతో ఎవరిని అక్కడికక్కడ కట్టడి చేయడంతో ఇరుపక్షాల మధ్య వాగ్వివాదం సద్దుమనిగి పెను ముప్పు తప్పింది. వైసిపి మహిళా మణులు తమపై దుర్భాషలాడిన వారిపై చర్యలు తీసుకోవాలంటూ తిరుపతి ఈస్ట్ డిఎస్పి భక్తవత్సలం కు ఫిర్యాదు చేశారు. పోలీసులు పెద్ద సంఖ్యలో చేరుకుని కట్టడి చేసి నిరసన చేస్తున్న స్థలం నుండి పంపివేశారు. దీంతో వివాదం సద్దుమణిగింది.

# పరిహారం లేకుండానే భూములు స్వాధీనం

భోగాపురం : పెన్ పవర్ మే 16: భోగాపురం ఎయిర్‌పోర్ట్ కోసం భూములు ఇచ్చిన రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. భూములు కోల్పోయిన రైతులకు దక్కాల్సిన పరిహారం నేటికీ అందలేదు. పరిహారం కోసం శుక్రవారం బైరెడ్డిపాలెం అప్రోచ్ రోడ్డు పనులను రైతులు అడ్డుకున్నారు. వృద్ధ దంపతులైన ఇద్దరు రైతులు జెసిబి తొట్టెలో కూర్చొని నిరసన తెలపగా డ్రైవర్ వారిని తొట్టెతో పైకి లేపి పక్కన పెట్టడం వివాదాస్పదమైంది. ఈ ఘటనపై ఆర్‌డిఒకు ఫిర్యాదు చేశారు. భూసేకరణకు సంబంధించిన పరిహారం అంశాలు న్యాయపరమైన ప్రక్రియలో ఉన్నాయని, బాధితులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని కలెక్టర్ ఎస్. రామసుందర్ రెడ్డి తెలిపారు. భవిష్యత్‌లో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు, పోలీసులకు ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. జాతీయ రహదారి నుంచి ఎయిర్‌పోర్ట్‌కు వెళ్లేందుకు సవరవిల్లి పంచాయతీ ఉప్పాడపేట జంక్షన్ వద్ద ట్రంపెట్ నిర్మాణం కోసం 19.85 ఎకరాల భూమిని సేకరించారు. ట్రంపెట్ నుంచి ఎయిర్‌పోర్ట్‌కు అప్రోచ్ రోడ్డు నిర్మాణం కోసం మరో 60 ఎకరాల భూమిని రైతుల నుంచి స్వాధీనం చేసుకున్నారు. అప్పట్లో 20.22 ఎకరాల భూమికి సంబంధించిన రూ.19. 89 కోట్ల పరిహారాన్ని కొంతమంది రైతుల ఖాతాల్లో జమ చేశారు. మిగతా భూ పరిహారాన్ని వివిధ కారణాల రీత్యా లారా (ల్యాండ్ అక్విజిషన్ రీ హేబిలిటేషన్ అథారిటీ) కోర్టులో జమ చేసినట్లు సమాచారం.

పెన్ పవర్
రాయలసీమ
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా। తిరుపతి జిల్లా। చిత్తూరు జిల్లా। వై.ఎస్.ఆర్. కడప జిల్లా।

# కబ్జాదారుల నుంచి తమ స్థలాన్ని కాపాడాలి.

### -- బాధితురాలు కామేశ్వరి ఆవేదన.



తిరుపతి క్రైమ్ బ్యూరో,పెన్ పవర్,,ఏప్రిల్ 16. తిరుపతి అవిలాలలో ఎన్నో ఏళ్లుగా నివాసముంటున్న తమ ఇంటిని కబ్జాదారులు ధ్వంసం చేశారని ఆవిలాలకు చెందిన దండు కామేశ్వరి ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ, అవిలాల పరిధిలోని లెక్క దాఖలాలు 146, సర్వే నంబర్ 242/బి లో తమకు మూడు సెంట్ల స్థలం ఉందని తెలిపారు. గత 25 సంవత్సరాలుగా అదే స్థలంలో కుటుంబంతో కలిసి నివాసముంటున్నామని చెప్పారు. అయితే ఇటీవల ఎస్‌టీవీ నగర్‌కు చెందిన యశోద అనే మహిళ కొందరు రౌడీలతో కలిసి వచ్చి తమపై దాడి చేసి, ఇంటిలోని సామాన్లను మురికి కాలవలో విసిరేసి ఇంటిని ధ్వంసం చేశారని ఆరోపించారు. ఈ ఘటనతో తమ కుటుంబం తీవ్ర భయాందోళనలకు గురైందని తెలిపారు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయగా, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకునేలోపే కబ్జాదారులు అక్కడి నుంచి పారిపోయారని పేర్కొన్నారు. తాను ఎన్నో ఏళ్లుగా పులివర్తి నాని నాయకత్వంలోని తెలుగుదేశం పార్టీ లో పనిచేస్తున్నానని తెలిపారు. ఈ విషయాన్ని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానికి వివరించగా, ఆయన సానుకూలంగా స్పందించి తమకు న్యాయం చేస్తానని, ఇల్లు నిర్మాణం చేపట్టేందుకు సహకరిస్తానని హామీ ఇచ్చారని చెప్పారు. అయితే కొందరు తమ స్థలంపై కన్నేసి తిరుపతికి చెందిన రౌడీలను అడ్డుపెట్టుకుని స్థలాన్ని కాజేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆమె ఆరోపించారు. ఉన్నతాధికారులు స్పందించి తమ కుటుంబానికి రక్షణ కల్పించి, స్థలాన్ని కబ్జాదారుల నుంచి కాపాడాలని వేడుకున్నారు.

# సూరయ్యకట్టలో వృద్ధుడి ఇంటి కబ్జాకు యత్నం..!

### --జనసేన నాయకుడినంటూ బెదిరింపులు.
### -- దౌర్జన్యానికి అడ్డుకట్ట వేసి వృద్ధుడికి అండగా సిపిఎం.




తిరుపతి క్రైమ్ బ్యూరో, పెన్ పవర్,మే 16.. తిరుపతి నగరం కపిలతీర్థం రోడ్డులోని ధోబీఘాట్ సమీపం సూరయ్యకట్ట ప్రాంతంలో ఒంటరి వృద్ధుడు తంగరాజు ఇంటిపై జరిగిన దౌర్జన్య ఘటన తీవ్ర ఆందోళనకు గురిచేస్తోందని సిపిఎం నాయకులు పేర్కొన్నారు. అద్దెకు ఉంటూ ఇంటినే తమదిగా ప్రకటించడం, "జనసేన పార్టీ నాయకుడిని" అంటూ బెదిరింపులకు దిగడం, ఎమ్మెల్యే పేరు అడ్డుపెట్టుకుని బలహీనులపై దౌర్జన్యం చేయటం, పోలీసుల చుట్టూ ఒంటరి వృద్ధుడు తిరిగినా దౌర్జన్యకారులపై కేసులు నమోదు చేయకపోవటం తీవ్ర ఆందోళన కలిగించే విషయమని సిపిఎం నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. పేదలు, వృద్ధులను లక్ష్యంగా చేసుకుని తిరుపతి లో కొందరు రౌడీయిజంతో భయభ్రాంతులకు గురిచేయడం సమాజానికి ప్రమాదకర సంకేతమన్నారు. శనివారం నాటి ఉదయం బాధితుడి ఇంటిని పరిశీలించిన సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు టి. సుబ్రహ్మణ్యం, సిపిఎం నగర కార్యదర్శి కే. వేణుగోపాల్ మాట్లాడుతూ నేతల పేర్లు అడ్డుపెట్టుకుని బలహీనుల ఆస్తులపై కన్నేయడం, బెదిరింపులు, భౌతిక దాడులకు పాల్పడడం దుర్మార్గమన్నారు. ఇలాంటి దౌర్జన్యాలను ఏమాత్రం ఉపేక్షించబోమని, బాధిత వృద్ధుడు తంగరాజుకు సిపిఎం అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు. బాధితుల కథనం మేరకు..... తంగరాజు ఇంటిలో బాడుగకు ఉంటున్న రాజారత్నం, అతని కుమారులు మేము జనసేన నాయకులం "ఇల్లు మాదే నువ్వు బయటకు పో'' అంటూ ఒంటరి వృద్ధుడిని కొట్టి బయటకుతరిమివేసినట్టు తెలిపారు. జనసేన నాయకుడినని చెబుతూ రౌడీలను పిలిపించి బెదిరింపులు, భౌతిక దాడులకు పాల్పడినట్లు స్థానిక ప్రజలు చెబుతున్నారు. సుమారు 20 మంది రౌడీలు మద్యం సేవించి వృద్ధుడిపై భౌతిక దాడులకు పాల్పడటమే కాకుండా, ఇంటికి తాళాలు వేసిన ఘటన దుర్మార్గమని సిపిఎం నాయకులు పేర్కొన్నారు. వృద్ధుడికి ఎవరూ లేరన్న అదును చూసుకుని లక్షల రూపాయల విలువైన స్థలాన్ని, ఇంటిని కబ్జా చేసేందుకు ప్రయత్నించడం అమానుష చర్య అని అన్నారు. ఈ ఘటనపై స్పందించిన సిపిఎం బృందం నేడు బాధితుడి ఇంటిని పరిశీలించింది. దౌర్జన్యంగా వేసిన తాళాలను సిపిఎం ఆధ్వర్యంలో తొలగింపజేసి, వృద్ధుడి ని తిరిగి తన ఇంటిలోకి ప్రవేశించేలా చర్యలు చేపట్టడం జరిగింది. గత 30 సంవత్సరాలుగా ఆ ప్రాంతంలో నివసిస్తూ, ఇంటికి సంబంధించిన ఒరిజినల్ పట్టా, మున్సిపల్ పన్ను రసీదులు సహా అన్ని చట్టబద్ధ పత్రాలు తంగరాజు పేరుపైనే ఉన్నాయని నాయకులు తెలిపారు. తన కష్టార్జితంతో నిర్మించుకున్న ఇంటి నుంచి వృద్ధుడిని బయటకు నెట్టివేయడం మానవత్వానికే మచ్చ అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాజారత్నం, అతని కుమారులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇప్పటికే పోలీసులకు ఫిర్యాదు అందజేసినట్లు తెలిపారు. న్యాయం జరిగే వరకు సిపిఎం ఆధ్వర్యంలో బాధితుడికి అండగా నిలిచి పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బారాయుడుగారు జరుగుతున్న అన్యాయాలపై స్పందించి పేదలకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు ఆర్. లక్ష్మి, పి. బుజ్జి, ఎం. రాజు, ఎండి. శ్రీనివాసులు, పార్థసారథి, సుజాతమ్మ, సిద్ధు, స్థానికులు ఉమా తదితరులు పాల్గొన్నారు.

# పదో తరగతి ఫెయిల్ విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ

### ఒక్కో విద్యార్థిపై ప్రత్యేక దృష్టి పెట్టాలి : కలెక్టర్ కె. దినేష్ కుమార్



చింతూరు, పెన్ పవర్ ,మే 16: పోలవరం జిల్లాలో పదో తరగతి పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులకు సప్లమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని పోలవరం జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ సంబంధిత ఉపాధ్యాయులను ఆదేశించారు. శనివారం రాత్రి చింతూరు మండలంలోని గిరిజన సంక్షేమ శాఖ బాలికల ఆశ్రమ పాఠశాల, నర్సింగాపురంలో నిర్వహిస్తున్న సప్లమెంటరీ ప్రత్యేక తరగతులను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా చింతూరు ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి శుభం నౌక్వాల్ కూడా పాల్గొన్నారు. పదో తరగతిలో వివిధ సబ్జెక్టుల్లో ఫెయిల్ అయిన విద్యార్థులకు ఆయా సబ్జెక్టులను ఒకటికి రెండుసార్లు బోధిస్తూ, ప్రతి విద్యార్థికి ప్రత్యేక శ్రద్ధతో అర్థమయ్యే రీతిలో పాఠాలు చెప్పాలని కలెక్టర్ సూచించారు. సప్లమెంటరీ పరీక్షల్లో ప్రశ్నలకు ఎలా సమాధానాలు రాయాలి, ముఖ్యాంశాలను ఎలా గుర్తుంచుకోవాలి వంటి అంశాలను ఉపాధ్యాయులు ప్రాక్టికల్‌గా వివరించాలని ఆదేశించారు. ఆశ్రమ పాఠశాలలో ఎంతమంది బాలికలు ఫెయిల్ అయ్యారు, ప్రస్తుతం ఎంతమంది ప్రత్యేక తరగతులకు హాజరవుతున్నారు అనే వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ప్రతిరోజూ అందిస్తున్న ఆహార వసతులపై కూడా ఆరా తీశారు. ప్రత్యేక క్లాసులకు హాజరవుతున్న విద్యార్థినులకు పోషకాహారం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్, ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి శుభం నౌక్వాల్ కలిసి విద్యార్థులతో భోజనం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో నేరుగా మాట్లాడి, ఉపాధ్యాయులు చెప్పే పాఠాలు అర్థమవుతున్నాయా లేదా, సబ్జెక్టులపై ఇంకా ఏవైనా సందేహాలు ఉన్నాయా అని తెలుసుకున్నారు. సప్లమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించేందుకు ప్రతి విద్యార్థికి వ్యక్తిగత మార్గదర్శనం అందించాలని, ఫెయిల్ అయిన విద్యార్థులు నిరుత్సాహానికి లోనుకాకుండా ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగేందుకు ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని కలెక్టర్ సూచించారు.

# సీఎం రాక కోసం ఎదురుచూస్తున్న మత్స్యకారుల కుటుంబాలు..

ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి రాకతో దద్దరిల్లిన ఇసుకపల్లి పాలెం..

మత్స్యకార గ్రామాల్లో పండగ వాతావరణం.. ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికిన మత్స్యకారులు,గ్రామస్తులు...

మత్స్యకారుల గ్రామాలను అభివృద్ధి చేసి చూపిస్తా..

మత్స్యకారుల గుండెల్లో పెట్టుకొని చూసుకుంటా..కావలి శాసనసభ్యులు, కావ్య క్రిష్ణారెడ్డి






అల్లూరు మండలం ఇసుకపల్లి పాలెం. పెన్ పవర్ ( స్టాఫ్ రిపోర్టర్) మే:16 కావలి నియోజకవర్గంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లు వేగంగా కొనసాగుతున్నాయి. ఈనెల 19వ తేదీన తుమ్మలపెంటలో నిర్వహించనున్న "మత్స్యకారుల సేవలో" కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి కావలి శాసనసభ్యులు దగుమాటి వెంకట కృష్ణారెడ్డి నియోజకవర్గంలోని మత్స్యకార గ్రామాల్లో విస్తృతంగా పర్యటిస్తూ ప్రజలను స్వయంగా ఆహ్వానిస్తున్నారు. ఈ క్రమంలో శనివారం అల్లూరు మండలం ఇసుకపల్లి పంచాయతీ పరిధిలోని ఇసుకపల్లి పాలెంలో ఎమ్మెల్యే గ్రామ ప్రజలు ఘన స్వాగతం పలికారు.ఎమ్మెల్యే రాకతో గ్రామమంతా సందడిగా మారింది. గ్రామ వీధుల్లో భారీ సంఖ్యలో మహిళలు, యువకులు, మత్స్యకార కుటుంబాలు చేరుకొని హారతులు పట్టి, పూలమాలలు వేసి స్వాగతం పలికారు. గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది. స్థానికులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఎమ్మెల్యే కలుసుకోవడంతో ఇసుకపల్లి పాలెం జనసంద్రంగా మారింది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి గ్రామానికి వెళ్లి మత్స్యకార కుటుంబాలను స్వయంగా పలకరించారు. వారి సమస్యలు, జీవన పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం మత్స్యకారుల అభ్యున్నతికి కట్టుబడి ఉందని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మత్స్యకార సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. "మత్స్యకారుల సేవలో" కార్యక్రమం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకార కుటుంబాలకు అండగా నిలుస్తోందని చెప్పారు.తుమ్మలపెంటలో జరిగే సభకు ప్రతి మత్స్యకార కుటుంబం పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి స్వయంగా వచ్చి మత్స్యకార కుటుంబాలతో సమావేశమవడం ఈ ప్రాంతానికి గర్వకారణమని పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు.కావలి నియోజకవర్గంలో ఉన్న మత్స్యకార గ్రామాలను అభివృద్ధి చేసి చూపిస్తా.. ప్రతి ఒక కుటుంబానికి అండగా ఉంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు..గ్రామస్తులు మాట్లాడుతూ,ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తమ ప్రాంతానికి రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. మత్స్యకారుల సమస్యలను గుర్తించి ప్రత్యేక కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి ప్రతి గ్రామంలో తిరుగుతూ సభ విజయవంతం కోసం చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు.మత్స్యకార మహిళలు ఎమ్మెల్యే కలిసి తమ కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న సహాయంపై సంతోషం వ్యక్తం చేశారు. గ్రామ యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని సీఎం సభకు పూర్తి స్థాయిలో మద్దతు ప్రకటించారు. "కావలి ఎమ్మెల్యే మాకు ఎప్పుడూ అందుబాటులో ఉంటారు" అంటూ గ్రామస్తులు అభిమానాన్ని చాటుకున్నారు.

ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు బీద గిరి ,స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు, మత్స్యకార కాపులు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామ ప్రజల ఉత్సాహం చూసిన నాయకులు సభను భారీ విజయవంతం చేస్తామని ధీమా వ్యక్తం చేశారు.

# కళ్యాణం కమనీయం

జొన్నవాడలో వెలసియున్న శ్రీ మల్లికార్జున స్వామి సమేత కామాక్షితాయి అమ్మవార్ల దివ్య కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించబడింది.




బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ మే 16. ఆలయ వెలుపట పరిమళ పుష్పాలతో స్వామి అమ్మవార్లకు కళ్యాణ మండపంలో అందంగా అలంకరించారు. కళ్యాణ మహోత్సవ కార్యక్రమాలు సంప్రదాయబద్ధంగా ప్రారంభమయ్యాయి. తొలుత స్థానిక ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, ఆలయ చైర్మన్ అశోక్ రెడ్డి, పాలకమండలి సభ్యులు కలిసి విజయవాడలోని కనకదుర్గ దేవస్థానం నుండి తెచ్చిన పవిత్ర సారెను స్వామి అమ్మవార్లకు సమర్పించారు. ఈ సందర్భంగా వేదపండితులు మంత్రోచ్చారణల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం ఎంతో ఆధ్యాత్మిక వాతావరణంలో ఎదురు కోలు కార్యక్రమం నిర్వహించబడింది. సంప్రదాయ సంగీత వాద్యాల మధ్య భక్తుల హర్షధ్వానాలతో కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది. తర్వాత ఘట్టాల వారీగా స్వామి అమ్మవార్ల దివ్య కళ్యాణం నిర్వహించ్చారు. ప్రతి ఘట్టం భక్తులను ఆధ్యాత్మికతలో ముంచెత్తింది. కళ్యాణ



వేడుక సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. మహిళలు, పురుషులు స్వామి అమ్మవార్లను దర్శించుకొని కళ్యాణం లో పాల్గొని ఆశీస్సులు పొందారు. ఈ దివ్య కళ్యాణాన్ని తిలకించిన భక్తులు "జై మల్లికార్జున స్వామి", "జై కామాక్షితాయి అమ్మవారు" అంటూ భక్తి నినాదాలతో ఆలయ ప్రాంతాన్ని మార్మోగించారు. వచ్చిన భక్తులకు ఎక్కడ కూడా ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ పాలకమండలి సభ్యులు,ఈఓ, ఆలయ సిబ్బంది అన్ని సౌకర్యాలను భక్తులకు ఏర్పాటు చేశారు. విజయవాడ కనకదుర్గ చైర్మన్ దంపతులు కూడా కల్యాణంలో పాల్గొన్నారు. దీంతో ఆ ప్రాంతమంతా పండుగ వాతావరణం నెలకొంది. అనంతరం భక్తులు చదువులు చదివించి తీర్థప్రసాదాలను స్వీకరించారు.

# నీటి నిల్వ ఉన్న డ్రమ్ము లో పడి మూడేళ్ల చిన్నారి మృతి...

దొరవారిసత్రం, పెన్ పవర్, మే 16 అభం శుభం తెలియని గిరిజన చిన్నారి నీరు నిల్వ ఉన్న డ్రమ్ము లో ప్రమాదవశాత్తు పడి ప్రాణాలు విడిచిన ప్రమాద సంఘటన శనివారం దొరవారి సత్రం మండలంలోని, గొల్లపాలెం గిరిజన కాలనీలో జరిగింది. వివరాల మేరకు గొల్లపాలెం గిరిజన కాలనీకి చెందిన తిరుమల శెట్టి. శివ, మరెమ్మకు ఇద్దరు పిల్లలు కుమార్తెకు ఆరేళ్ల, మూడేళ్ల కుమారుడు శనివారం ఉదయం ఆవరణంలోనే ఆడుకుంటూ నీరు నిల్వ ఉంచిన డ్రమ్ము లాంటి పాత్రలోకి తల క్రింద మునిగి కాళ్లు పైకి రావడంతో చిన్నారి మృతి చెందాడు. తల్లిదండ్రులు మాత్రం బిడ్డను గమనించకుండా ఆటలాడుకుంటుంటాడని అదమరిచి కొంత సమయానికి వెతకడంతో అప్పటికే మృతి చెందాడు. కొన ఊపిరి ఉందని ఆశపడి ప్రాథమిక వైద్యానికి ప్రయత్నించారు. తలనీట మునగడంతో



కొన్ని నిమిషాలకి ప్రాణాలు విడిచాడు. బిడ్డ కళ్ళ ఎదుటే కొంత సమయానికే విగత జీవితం కనిపించడంతో తల్లిదండ్రులు కన్నీరు మునీరుగా విలపించారు. కన్న కొడుకును కాపాడుకోలేక పోయామని రోదన చెందారు. ఈ సంఘటనతో గిరిజన కాలనీలో విషాద ఛాయలు నెలకొన్నాయి.

# తాడి ఫెస్టివల్స్ - తాటికల్లు మేళాలు నిర్వహిస్తాం : తిరకాల సీనయ్య గౌడ్

గౌడ సంక్షేమ సంఘం నెల్లూరు జిల్లా నూతన కమిటీ జిల్లా పర్యటనలో భాగంగా




బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ 16. బుచ్చిరెడ్డిపాలెం పట్టణంలో చెన్నూరు రోడ్డులో పద్మావతి కల్యాణ మండపము నందు శనివారం పర్యటించడం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన పరిచయ కార్యక్రమంలో నూతన జిల్లా కమిటీని గౌడ కులస్తులు ఘనంగా సన్మానించడం జరిగింది. అనంతరం గౌడ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు తిరకాల. సీనయ్య గౌడ్ మాట్లాడుతూ బుచ్చిరెడ్డిపాలెం లో గౌడ కులస్తుల జనాభా చాలా ఎక్కువగా ఉందని అలాగే రాజకీయంగా చైతన్యవంతమైందని మండల, జిల్లా, రాష్ట్ర రాజకీయాలపై ప్రభావం చూపే నాయకులు ఇక్కడి నుంచి ఎదగాలని యువత అన్ని రంగాలలో విజయాలు సాధించాలని విద్యార్థులు విద్యారంగంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. అలాగే రాబోవు రోజుల్లో తాడి ఫెస్టివల్ మరియు తాటికల్లు మేళాలు నిర్వహిస్తామన్నారు.

అలాగే మహిళలు, యువత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను పొందాలని గౌడ్ గీత కార్మికులు, వృద్దులు, వితంతువులు, వికలాంగులు, పెన్షన్లు తీసుకోవాలని గీత కార్మికులు విధిగా లైసెన్సులు పొందాలని గుర్తింపు కార్డులు కలిగి ఉండాలని గ్రామాలలో సొసైటీల ఏర్పాటుకు పాటుపడతామని సొసైటీ భవనాల నిర్మాణం కోసం కృషి చేస్తామని తెలిపారు. అలాగే నిరుద్యోగ యువత పారిశ్రామికంగా వ్యాపార పరంగా నిలదొక్కుకోవాలని మద్యం బెల్ట్ షాపులో నిరోధానికి ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని గ్రామ గ్రామాన గౌడ్లను సమీకరించి వారిని జాగృతం చేసి సమర్థవంతమైన నాయకులగా తయారు చేస్తామన్నారు. జాతీయ నాయకులలో స్ఫూర్తితో పని చేయాలని సర్దార్ సర్వాయి. పాపన్న గౌడ్, గౌతు. లచ్చన్న గౌడ్ వారసత్వాన్ని అందుపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు.

అనంతరం బుచ్చిరెడ్డిపాలెం మున్సిపల్ చైర్మన్ మోర్ల. సుప్రజా మురళి గౌడ్ మాట్లాడుతూ తాను గౌడ కులంలో పుట్టినందుకు చాలా అదృష్టంగా భావిస్తున్నానని దాని కారణంగా నేడు బుజ్జి మున్సిపల్ చైర్మన్ బాధ్యతలను నిర్వహించడం అన్ని వర్గాల ప్రజలకు సేవ చేయడం చాలా సంతోషాన్నిస్తుందని తెలిపారు. అలాగే నూతన గౌడ సంఘం కమిటీ ఆధ్వర్యంలో నెల్లూరు జిల్లాలో నాయకులను తయారు చేసే కర్మాగారంగా తయారవ్వాలి అన్నారు. అట్లాగే గౌడ్ల అన్ని రంగాలలో ఎదుగుదలకు తమ వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా అందిస్తామని చెప్పారు.

పై కార్యక్రమంలో నాయకులు సంఘం మండల జడ్పిటిసి రావుల. లక్ష్మీ ప్రసన్న గౌడ్ రావుల. సుధాకర్ గౌడ్, దద్దోలు. చక్రపాణి గౌడ్, తుళ్లూరు. మల్లికార్జున గౌడ్, ఎంపులూరు. భాస్కర్ గౌడ్, ఏపూరి. రమేష్ గౌడ్, ముక్కు. రాధాకృష్ణ గౌడ్, గౌడ్, ఉదయగిరి.

శ్రీనివాసులు గౌడ్, జడపల్లి. రాజారావు గౌడ్, దోర్నాధుల. పవన్ గౌడ్, పంది. మస్తానయ్య గౌడ్, తిరకాల. శివా గౌడ్, అన్నం.మాధవ్ గౌడ్, కుదుముల. విజయకృష్ణ గౌడ్, మహేంద్ర గౌడ్ మరియు ఇతర నాయకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# డెంగ్యూ నివారణపై అవగాహన ర్యాలీ...







పెళ్లకూరు, పెన్ పవర్, మే 16 జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా శనివారం డెంగ్యూ నివారణ పై అవగాహన ర్యాలీ ని స్థానిక ప్రాథమిక వైద్యాదికారి సి. హెచ్ సుజాత ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రాధమిక ఆరోగ్య కేంద్రం నుండి పెళ్లకూరు బస్ స్టాప్ వరకు ర్యాలీ నిర్వహించారు.అనంతరం సి. హెచ్ ఓ శివారెడ్డి మాట్లాడుతూ డెంగ్యూ సరైన సమయంలో రోగ నిర్ధారణ జరగకపోతే మరణాలకు దారితీస్తుందన్నారు. దోమలు పెరుగుదల అరికట్టే విధానం, డెంగ్యూ వ్యాధి ప్రబలకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు,

తదితర వాటిపై వివరించారు. దోమకాటు వద్దు–దోమతెరలు ముద్దు, పరిసరాల శుభ్రతే–ఆరోగ్యానికి తొలిమెట్టు అంటూ నినాదాలు చేశారు.ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# స్టీలు బ్రిడ్జి నిర్మాణ లోపాలపై నిపుణుల బృందంతో విచారణ

అమరావతి : పెన్ పవర్ మే 16: రాజధాని అమరావతి స్టీలు బ్రిడ్జి నిర్మాణ లోపాలపై నిపుణుల బృందంతో విచారణ జరిపించాలని, నాణ్యతా ప్రమాణాలను పరిరక్షించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బాబూరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాజధాని అమరావతిలోని ఉండవల్లి పరిధిలో బకింగ్ హామ్ కెనాల్‌పై రూ.64 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న స్టీలు బ్రిడ్జి గడ్డర్లు, వంతెన కుంగిపోయి, కొంత భాగాన్ని తొలగించాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ఈ లోపాలను సిఆర్‌డిఎ, ఎడిసిఎల్, నిర్మాణ కాంట్రాక్టు సంస్థలు గుర్తించకుండా కప్పిపుచ్చే ప్రయత్నాలు చేయడం తగదన్నారు. ఇంజినీరింగ్ నిపుణులతో ఈ లోపాలపై విచారణ జరిపించి వాస్తవాలు వెలికితీయాలని కోరారు. బడా కాంట్రాక్టు సంస్థలు వివిధ రకాల పనులను సబ్ కాంట్రాక్టర్లకు అప్పగించి చేతులు దులుపుకుంటున్నాయని, కాంట్రాక్టు సంస్థలను నియంత్రించలేని స్థితిలో సిఆర్‌డిఎ, ఇతర సంస్థల అధికారులు ఉండటం శోచనీయమని తెలిపారు. హడావుడి పనులతో, తగినంత పర్యవేక్షణ లేకుండా రాజధాని పనులు సాగుతున్నాయని పేర్కొన్నారు. ఈ బ్రిడ్జి పనులను పలుమార్లు ప్రత్యక్ష పరిశీలన చేసిన మున్సిపల్‌శాఖ మంత్రి ఈ లోపాలపై స్పందించాలని, తగు చర్యలు చేపట్టాలని కోరారు. ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న రాజధాని అమరావతి పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పరిరక్షించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, బడా కాంట్రాక్ట్ సంస్థలు జవాబుదారీతనం లేకుండా వ్యవహరించడాన్ని అరికట్టి వాటిని నియంత్రించాలని, పర్యవేక్షణకు అవసరమైన సిబ్బంది, ఇంజినీర్లను నియమించాలని అన్నారు.

# ఏనుగుల బీభత్సం

గుమ్మలక్ష్మీపురం: పెన్ పవర్ మే 16: పార్వతీపురం మన్యం జిల్లాలో ఏనుగుల బీభత్సం కొనసాగుతోంది. జయ్యమ్మవలస మండలం పెదబుడ్డిడి సమీపాన గల అరటి తోటను, నీటి సరఫరా కోసం ఏర్పాటు చేసిన మోటారు పైపులను ధ్వంసం చేశాయి. మరోవైపు వరి పొలంలోకి చొరబడి పంటను నాశనం చేశాయి. ఏనుగుల దాడితో అరటి, కొబ్బరి, మామిడి పంటలకు నష్టం వాటిల్లడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. శుక్రవారం చినబుడ్డిడిలో నూర్పుడి యంత్రం, ట్రాక్టర్ ను ధ్వంసం చేశాయి. వరి ధాన్యాన్ని చిందరవందర చేశాయి. ఏనుగుల సంచారంతో పంట పొల్లాలోకి వెళ్లేందుకు రైతులు భయాందోళనకు గురవుతున్నారు. పంట నష్టపరిహారం చెల్లించాలని బాధిత రైతులు ప్రభుత్వాన్ని కోరారు.

# బోగోలు మత్స్యకార గ్రామాల్లో ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి సుడిగాలి పర్యటన.. సీఎం సభకు ఆహ్వాన మహోత్సవం..





బోగోలు పెన్ పవర్ మే 16 రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈనెల 19న తుమ్మలపెంటలో నిర్వహించనున్న "మత్స్యకారుల సేవలో" కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి విస్తృతంగా పర్యటిస్తున్నారు. ఇందులో భాగంగా బోగోలు మండలంలోని పలు మత్స్యకార గ్రామాల్లో ఎమ్మెల్యే సుడిగాలి పర్యటన నిర్వహించారు.కొత్తూరు, పాతపాలెం,తాటి చెట్లపాలెం, కొత్త బంగారుపాలెం, పాత బంగారుపాలెం, చంట బంగారుపాలెం గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటనతో సందడి వాతావరణం నెలకొంది. గ్రామాలన్నీ పండుగ వాతావరణాన్ని తలపించగా, మత్స్యకార కుటుంబాలు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికాయి.

మహిళలు హారతులు పట్టి స్వాగతం పలకగా, యువత భారీగా తరలివచ్చి నినాదాలతో గ్రామాలను మార్మోగించారు.సీఎం చంద్రబాబు పాల్గొనే "మత్స్యకారుల సేవలో" కార్యక్రమానికి ప్రతి మత్స్యకార కుటుంబం పెద్ద ఎత్తున హాజరుకావాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ప్రతి గ్రామంలో తిరుగుతూ మత్స్యకారులను స్వయంగా కలుసుకుని సభ ప్రాధాన్యతను వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకార సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, సీఎం చంద్రబాబు చేతుల మీదుగా మత్స్యకార కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేయనున్నారని తెలిపారు.మత్స్యకారుల సమస్యలను తెలుసుకుంటూ వారి అభిప్రాయాలను ఎమ్మెల్యే వినిపించారు. తీర ప్రాంత గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, మత్స్యకారుల జీవనోపాధి మెరుగుపడేలా మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు తీసుకొస్తామని హామీ ఇచ్చారు. సీఎం పర్యటనతో తమ గ్రామాలకు మరింత ప్రాధాన్యత లభిస్తోందని స్థానిక మత్స్యకారులు ఆనందం వ్యక్తం చేశారు.

గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటన సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు, మత్స్యకార సంఘాల నాయకులు భారీగా పాల్గొన్నారు. ప్రతి గ్రామంలో సభ విజయవంతం కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తూ ప్రజలను చైతన్యపరిచారు. సీఎం సభను చారిత్రాత్మక విజయంగా నిలపాలని ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు..

# బాధిత కుటుంబానికి అండగా నిలిచిన ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి...

## కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న రవీంద్రబాబుకు రూ.2 లక్షలు ఆర్థిక సహాయం అందజేత..

పెన్ పవర్ కావలి మే 16 కావలి పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో శనివారం మానవత్వాన్ని చాటే కార్యక్రమం జరిగింది. కావలి శాసనసభ్యులు దగుమాటి వెంకట కృష్ణారెడ్డి చేతుల మీదుగా దగదర్తి మండలం కే.కే.గుంట గ్రామానికి చెందిన కోవూరు రవీంద్రబాబు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన ఎల్‌వోసీ అందజేశారు. కోవూరు రవీంద్రబాబు కొంతకాలంగా తీవ్ర కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ నెల్లూరులోని కిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. వైద్యుల సూచనల మేరకు ఆయనకు ప్రత్యేక వైద్యం, నిరంతర చికిత్స అవసరమని తేలడంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చికిత్స ఖర్చులు భరించలేని పరిస్థితిలో బాధిత కుటుంబం ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి ని కలిసి తమ సమస్యను వివరించి సహాయం కోరింది.బాధిత కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న ఎమ్మెల్యే వెంటనే స్పందించి, ముఖ్యమంత్రి సహాయ నిధి కింద ఎల్‌వోసీ మంజూరు అయ్యేలా అధికారులతో సమన్వయం చేసి దరఖాస్తు ప్రక్రియను వేగవంతం చేశారు. ఎమ్మెల్యే చొరవతో అత్యవసరంగా రూ.2,01,832/- (రెండు లక్షల ఒక వెయ్యి ఎనిమిది



వందల ముప్పై రెండు రూపాయలు) విలువైన గ్రాంట్ మంజూరై, ఆ సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి మాట్లాడుతూ, ప్రజలు ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఎంతో మేలు జరుగుతోందన్నారు. ప్రజలకు అవసరమైన ప్రతి సందర్భంలో తాను అండగా ఉంటానని, ఎవరికైనా వైద్య సహాయం అవసరమైతే ఎమ్మెల్యే కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.రవీంద్రబాబు కుటుంబ సభ్యులు మాట్లాడుతూ, అత్యంత క్లిష్ట సమయంలో ఎమ్మెల్యే వెంటనే స్పందించి సహాయం అందించడం తమకు ఎంతో ధైర్యాన్నిచ్చిందన్నారు. భారీ వైద్య ఖర్చులతో తీవ్ర ఆందోళనలో ఉన్న సమయంలో ప్రభుత్వం నుంచి వచ్చిన ఈ ఆర్థిక సాయం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. తమ కుటుంబానికి అండగా నిలిచిన ఎమ్మెల్యేకి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు,గ్రామ పెద్దలు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు..

# రైతులకు ఎస్‌వీపీఎం మేజర్ డిస్ట్రిబ్యూటరీకి సోమశిల జలాల విడుదల..

## ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి సూచనల మేరకు పూజా కార్యక్రమాలతో నీటి విడుదల..





బోగోలు పెన్ పవర్ మే 16 నెల్లూరు జిల్లా,కావలి నియోజకవర్గ రైతులకు సాగునీటి పరంగా ఊరటనిచ్చే ముఖ్య కార్యక్రమం శనివారం బోగోలు మండలంలో జరిగింది. కావలి శాసనసభ్యులు కావ్య కృష్ణారెడ్డి సూచనల మేరకు బోగోలు మండలం పరిధిలోని కావలి కాలువ 33 కిలోమీటర్ల వద్ద నుంచి ఎస్‌వీపీఎం మేజర్ డిస్ట్రిబ్యూటరీకి సోమశిల ప్రాజెక్టు జలాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా అధికారులు, రైతు నాయకులు, నీటి సంఘాల ప్రతినిధులు కలిసి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం ఖరీఫ్ సాగు పనులకు రైతులు సిద్ధమవుతున్న నేపథ్యంలో సాగునీటి అవసరం అధికంగా ఉన్న పరిస్థితిలో ఎమ్మెల్యే నీటి విడుదలపై ప్రత్యేక దృష్టి సారించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సమయానికి నీరు అందేలా అధికారులతో సమన్వయం చేసి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు నీటి పారుదల శాఖ అధికారులు వేగంగా చర్యలు తీసుకుని ఎస్‌వీపీఎం మేజర్ డిస్ట్రిబ్యూటరీకి నీటిని విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సోమశిల ప్రాజెక్టు మాజీ చైర్మన్ శ్రీ కండ్లగుంట మధుబాబు నాయుడు మాట్లాడుతూ, రైతుల ప్రయోజనాల కోసం ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. సాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం అభినందనీయమన్నారు. రైతుల పంటలు బాగా పండాలంటే సమయానికి నీరు అందడం చాలా ముఖ్యమని, ఆ దిశగా ప్రభుత్వం మరియు ఎమ్మెల్యే ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని పేర్కొన్నారు.నీటి పారుదల శాఖ డీఈలు శరత్ కుమార్, సత్య ప్రసాద్, ఏఈలు పాల్గొని నీటి విడుదల ప్రక్రియను పర్యవేక్షించారు. అధికారులు మాట్లాడుతూ, విడుదల చేసిన నీరు ఎస్‌వీపీఎం మేజర్ డిస్ట్రిబ్యూటరీ పరిధిలోని పలు గ్రామాల సాగుభూములకు ఉపయోగపడుతుందని తెలిపారు. నీటి వినియోగంలో రైతులు పరస్పర సహకారంతో వ్యవహరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో నాగులవరం పీఏసీఎస్ అధ్యక్షులు శ్రీ చిలకపాటి వెంకటేశ్వర్లు, నీటి సంఘం అధ్యక్షులు శ్రీ ఎర్రం వెంకటేశ్వర్ రెడ్డి, మునగాల కృష్ణారెడ్డి, శ్రీహరి నాయుడు, చే రెడ్డి కృష్ణారెడ్డి, నీటి సంఘ సభ్యులు, రైతులు, స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పూజా కార్యక్రమాల అనంతరం కాలువలోకి నీరు ప్రవహించడం చూసి రైతులు ఆనందం వ్యక్తం చేశారు.రైతులు మాట్లాడుతూ, సాగునీటి కోసం ఎదురుచూస్తున్న సమయంలో ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి చొరవతో సోమశిల నీరు విడుదల కావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. పంటల సాగుకు ఇది ఎంతో ఉపయోగపడుతుందని, రైతుల సమస్యలను గుర్తించి వెంటనే స్పందిస్తున్న ఎమ్మెల్యే గారికి కృతజ్ఞతలు తెలిపారు.కావలి నియోజకవర్గంలో రైతు సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ సాగునీటి సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే తీసుకుంటున్న చర్యలు రైతుల్లో నూతన ఆశలు నింపుతున్నాయని స్థానికులు అభిప్రాయపడ్డారు.

# సంతగుడిపాడులో స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర

## నరసరావుపేట నియోజకవర్గం ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు ఆధ్వర్యంలో ప్రత్యేక పరిశుభ్రత కార్యక్రమం

నరసరావుపేట, పెన్ పవర్ మే 16: పల్నాడు జిల్లా, రొంపిచర్ల మండలం సంతగుడిపాడు గ్రామంలో శనివారం స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక పరిశుభ్రత కార్యక్రమం చేపట్టారు. నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు ఈ కార్యక్రమానికి నేతృత్వం వహించారు. గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించిన ఎమ్మెల్యే అరవింద బాబు ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మమేకమయ్యారు. పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత శుభ్రత ఆవశ్యకతను వివరిస్తూ ఆరోగ్యకరమైన గ్రామం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని పిలుపునిచ్చారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా, తడి-పొడి చెత్తను వేరుచేసి నిర్దేశిత ప్రదేశాల్లోనే వేయాలని సూచించారు. ఈ పరిశుభ్రత కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు,



మండల అధికారులు, పంచాయతీ సిబ్బంది, గ్రామ పెద్దలు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. గ్రామంలోని ప్రధాన వీధులు, మురికి కాలువలు, బహిరంగ ప్రదేశాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అరవింద బాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం లక్ష్యం పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన ఆంధ్రప్రదేశ్‌ను నిర్మించడమేనని అన్నారు. ఇది ప్రభుత్వ కార్యక్రమంగా కాకుండా ప్రజా ఉద్యమంగా మారాలని అన్నారు. పరిశుభ్రతను ఒక అలవాటుగా మార్చుకోవాలని గ్రామస్తులకు సూచించారు.

# ప్లాస్టిక్ రహిత నరసరావుపేట కోసం పంచసూత్రాలు

## షాపుల ముందు చెత్త వేస్తే చర్యలు తప్పవు

## నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు, జిల్లా ఇంచార్జి కలెక్టర్ సంజన సింహ, మున్సిపల్ కమిషనర్ రమ్య కీర్తన.





నరసరావుపేట, పెన్ పవర్ మే 16: స్వచ్ఛ ఆంధ్ర మిషన్‌లో భాగంగా నరసరావుపేటను ప్లాస్టిక్ రహిత, పరిశుభ్ర పట్టణంగా తీర్చిదిద్దేందుకు పురపాలక సంఘం, ప్రజాప్రతినిధులు క్షేత్రస్థాయిలో చర్యలు ముమ్మరం చేశారు. శనివారం ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు, జిల్లా ఇంచార్జి కలెక్టర్ సంజన సింహ, మున్సిపల్ కమిషనర్ రమ్య కీర్తన కలిసి నరసరావుపేట మున్సిపల్ కార్యాలయం నుండి రెవిన్యూ డివిజనల్ అధికారి కార్యాలయం వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ రహిత జీవితానికి పంచసూత్రాలు అనే బ్యానర్‌ను ప్రదర్శించారు. ఎమ్మెల్యే అరవింద్ బాబు మాట్లాడుతూ ప్లాస్టిక్ రహిత నరసరావుపేట కోసం పంచసూత్రాలను అమలు చేయాలని అన్నారు. జూట్ లేదా గుడ్డతో చేసిన చేతి సంచులతోనే సరుకులకు వెళ్లాలని అన్నారు. ప్లాస్టిక్ నీటి బాటిళ్లకు బదులు రాగి/స్టీల్ బాటిళ్లను వాడాలన్నారు. హోటళ్లలో గాజు, స్టీలు పాత్రల్లోనే టీ, టిఫిన్ చేయాలన్నారు. నిషేధిత వస్తువులైన ప్లాస్టిక్ పూలదండలు, స్ట్రాల వాడకం పూర్తిగా మానేయాలన్నారు. వివాహ విందుల్లో ప్లాస్టిక్ డిస్పోజబుల్ గ్లాసుల స్థానంలో స్టీలు, మట్టి పాత్రలను మాత్రమే వాడాలన్నారు. గత రెండేళ్లుగా ప్రతి నెల మూడవ శనివారం స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని దానిలో భాగంగా ఈ శనివారం ఉదయం మార్కెట్ సెంటర్‌లో మున్సిపల్ అధికారులతో ఈ కార్యక్రమం నిర్వహించామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమాల్లో యువకులు, జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు హాజరవుతున్నారని అన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు, డీసీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ సూచనల మేరకు ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. షాపుల్లో ప్లాస్టిక్ వస్తువుల అమ్మకానికి వీల్లేదని, డిస్పోజబుల్ ప్లేట్లు, గ్లాసులు, ప్లాస్టిక్ గ్లాసులను పూర్తిగా నిషేధించినట్లు ఎమ్మెల్యే స్పష్టం చేశారు. వాటి స్థానంలో స్టీల్ ప్లేట్లు, స్టీల్ గ్లాస్లు, స్టీల్ టిఫిన్లు వాడాలని, షాపులకు జూట్ బ్యాగులు అందించి వాటి వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నామని తెలిపారు.

షాపుల ముందు చెత్త వేస్తే చర్యలు

ప్రతి దుకాణదారుడు తన షాపు ముందు తప్పనిసరిగా డస్ట్బిన్ ఏర్పాటు చేసుకోవాలని, రోడ్లపై, షాపుల బయట ఎక్కడా చెత్త కనిపించకూడదని ఎమ్మెల్యే హెచ్చరించారు. మున్సిపల్ కమిషనర్, కలెక్టర్ ఆదేశాల ప్రకారం చర్యలు తీసుకుంటామని, ముందస్తు హెచ్చరికలు జారీ చేసినప్పటికీ ఉల్లంఘిస్తే భారీ జరిమానాలతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు.


యువత సహకారం

స్థానిక జనసైనికులు, టీడీపీ సైనికులు, యువత కలిసికట్టుగా పని చేయాలని ఎమ్మెల్యే కోరారు. ప్రజలు స్వచ్ఛందంగా చెత్త తొలగించడానికి ముందుకు రావాలని, రోడ్లు శుభ్రం చేయాలని పిలుపునిచ్చారు. చెత్తరహిత సమాజం నిర్మాణమే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమాలకు సహకరించే వారికి అవార్డులు, రివార్డులు ఇస్తామని అన్నారు. ప్రత్యేక గుర్తింపు, ప్రశంసలు కల్పిస్తామని ఎమ్మెల్యే ప్రకటించారు. ప్లాస్టిక్ వల్ల భూమి, జలవనరులు కలుషితమవుతున్నాయని, భావితరాలకు మంచి వాతావరణం అందించేందుకు ప్రజలు, వ్యాపారులు సహకరించాలని కోరారు. నరసరావుపేటను రాష్ట్రంలోనే ఆదర్శ ప్లాస్టిక్ రహిత పురపాలక సంఘంగా తీర్చిదిద్దుతామని అన్నారు. ఈ కార్యక్రమం లో మున్సిపాలిటీ సిబ్బందితో పాటు ఉమ్మడి కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎస్టీ విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులతో చదువు ఆపొద్దు...విజ్ఞాన్ వర్సిటీలో ఉచితంగా చదివిస్తాం: ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు హామీ

## ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ చాటిన ఎస్టీ విద్యార్థులకు ఘనంగా అభినందన సభ

## 600 పైబడి మార్కులు సాధించిన 287 మంది విద్యార్థులకు విజ్ఞాన్ యూనివర్సిటీలో ఉచిత విద్యావకాశం





నరసరావుపేట, పెన్ పవర్ మే 16: ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఏ ఒక్క ఎస్టీ విద్యార్థి కూడా ఉన్నత చదువులకు దూరం కాకూడదన్నదే తమ సంకల్పమని నరసరావుపేట పార్లమెంటు సభ్యులు శ్రీ లావు శ్రీకృష్ణదేవరాయలు స్పష్టం చేశారు. ఇంటర్మీడియట్ పరీక్షల్లో అద్భుత ప్రతిభ కనబరిచిన పల్నాడు జిల్లా ఎస్టీ విద్యార్థులకు నరసరావుపేటలోని (ఎస్.ఎస్.ఎన్) కళాశాలలో శనివారం ఘనంగా అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎంపీ.. జిల్లా వ్యాప్తంగా వివిధ గ్రూపుల్లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన ఎస్టీ ప్రతిభావంతులను ప్రత్యేకంగా అభినందించి, సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ.. పల్నాడు జిల్లా వ్యాప్తంగా ఇంటర్‌లో 600 పైబడి మార్కులు సాధించిన 287 మంది షెడ్యూల్డ్ తెగలకు ( ఎస్.టీ ) చెందిన విద్యార్థులకు విజ్ఞాన్ యూనివర్సిటీలో ఉచితంగా సీటు కల్పించి, ఉచిత విద్యనందిస్తామని హామీ ఇచ్చారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయని తల్లిదండ్రులు పిల్లల చదువులను మధ్యలోనే ఆపేసే పరిస్థితి రాకూడదని, ధైర్యంగా పైచదువులకు పంపాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా 346 మంది ఎస్టీ విద్యార్థులు ఉత్తీర్ణులు అవ్వగా.. అందులో ఏకంగా 287 మంది (83% పైగా) ఫస్ట్ క్లాస్‌లో ఉత్తీర్ణత సాధించడం జిల్లాకే గర్వకారణమని ఎంపీ కొనియాడారు. ఇంతటి ఘన విజయానికి కారకులైన విద్యార్థులకు, రాత్రింబవళ్లు కష్టపడి వారికి మార్గదర్శకత్వం వహించిన ఉపాధ్యాయులకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఎస్టీ కుటుంబాల నుంచి ఒక్కో గ్రామానికి కనీసం నలుగురు చొప్పున చదువుకొని ఉన్నత స్థాయిల్లో స్థిరపడాలన్నదే తమ కోరికని ఎంపీ ఆకాంక్షించారు. వారిని చూసి గ్రామంలోని మరో పది మంది స్ఫూర్తి పొంది చదువుకుంటారని చెప్పారు. ఎస్టీ విద్యార్థులు కనీసం డిగ్రీ వరకైనా పూర్తి చేస్తే ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడం చాలా సులువవుతుందని, కాబట్టి తల్లిదండ్రులు పిల్లలను డిగ్రీ పూర్తయ్యే వరకు ఖచ్చితంగా ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. ఇదే వేదికపై నరసరావుపేట పరిసర ప్రాంతాల విద్యార్థుల సౌకర్యార్థం ఒక కొత్త ప్రభుత్వ జూనియర్ కాలేజీని ఏర్పాటు చేయాలని స్థానిక ఉపాధ్యాయులు.. ఎంపీ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఎంపీ నరసరావుపేటలో జూనియర్ కాలేజీ ఏర్పాటుకు తన వంతు కృషి చేస్తానని మాటిచ్చారు.

# భవిష్యత్తును ఆలోచించే కూటమి ప్రభుత్వం

## ఎలక్ట్రిక్ స్కూటీపై వచ్చి ఇంధన పొదుపు, ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించిన ప్రత్తిపాటి పుల్లారావు





చిలకలూరిపేట , పెన్ పవర్, మే 16 : చిలకలూరిపేట : కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రజల భవిష్యత్తు గురించి ఆలోచిస్తుందని, అందులో భాగంగానే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు ప్రతి నెల మూడవ శనివారం ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టి ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని సంకల్పించామని శాసనసభ్యులు, మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. 'ప్రజల ఆరోగ్యమే మహాభాగ్యం' అనే మంచి ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 175 నియోజకవర్గాల్లో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఇందులో భాగంగానే ముఖ్యమంత్రి కూడా శ్రీకాకుళం జిల్లాలో పాల్గొంటున్నారని తెలిపారు.

ప్లాస్టిక్ నిషేధం -- ప్రజారోగ్య పరిరక్షణ

ఈ మూడవ శనివారం యొక్క ప్రత్యేకత "ప్లాస్టిక్ నిషేధం" అని మాజీ మంత్రి శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు వివరించారు. ప్లాస్టిక్ వాడకం వలన క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు వస్తున్నాయని, ప్రజలు అనారోగ్యం పాలు కాకుండా ఉండాలంటే ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాల్సిన అవసరం ఉందని ఆయన పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ సంచులకు ప్రత్యామ్నాయంగా బట్ట మరియు జూట్ జనపనారతో చేసిన బ్యాగులను వాడి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కోరారు. వ్యాపారస్తులు కూడా ఈ మార్పును స్వీకరించి, కాటన్ మరియు జూట్ బ్యాగులను అందుబాటులో ఉంచితే వినియోగదారులకు ఎటువంటి ఇబ్బంది ఉండదని, దీనిపై ప్రజల్లో మరియు వ్యాపారులలో విస్తృత అవగాహన తీసుకురావడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యమని స్పష్టం చేశారు.

ఇంధన పొదుపుపై అవగాహన

పర్యావరణ పరిరక్షణ, ఇంధన పొదుపుపై అవగాహన కల్పించేందుకు తానే స్వయంగా ఇవాళ ఇంటి నుండి ఎలక్ట్రిక్ స్కూటర్ పై వచ్చినట్లు ఆయన తెలిపారు. ప్రతిరోజూ స్కూటర్ పై తిరుగుతామని కాదు కానీ, ప్రజల్లో ఒక అవగాహన తీసుకురావడానికి, అనవసరమైన ప్రయాణాలను తగ్గించుకుని అవసరమైన మేరకే ఇంధనాన్ని ఖర్చు చేయాలనే సందేశాన్ని ఇవ్వడానికే ఈ ప్రయత్నం చేశానని చెప్పారు.

రాయలసీమ అభివృద్ధి -- పరిశ్రమల వెల్లువ

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీసుకుంటున్న నిర్ణయాలు దేశంలోనే ఏ రాష్ట్రంలో లేని విధంగా ఉన్నాయని కొనియాడారు. నిన్ననే రాయలసీమలో ఫైట్స్ విమానాలు మరియు యుద్ధ విమానాలను తయారు చేసే పరిశ్రమల ఏర్పాటుకు సంబంధించి తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమైనదన్నారు. గతంలో రాయలసీమ అంటే ఒకలా ఉండేదని, కానీ ఇప్పుడు చంద్రబాబు పిలుపుతో అది "రాయల్ సీమ" గా మారుతోందని,

ఆ నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి కార్యరూపం దాల్చేలా చేస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో పెట్టుబడులు వస్తున్నాయంటే అది కూటమి ప్రభుత్వం చంద్రబాబు గొప్పతనమేనని, చంద్రబాబు మరియు లోకేష్ ల కష్టమే ఈ రాష్ట్ర భవిష్యత్తుకు పునాది అని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వల్ల ఉద్యోగాలు పోతాయనే ఆందోళన ఉన్న తరుణంలో కూడా, మన రాష్ట్రంలో చదువుకున్న విద్యార్థులకు రాబోయే పెట్టుబడుల ద్వారా అనేక ఉద్యోగ అవకాశాలు లభిస్తాయనే నమ్మకాన్ని, భరోసాని ఈ ప్రభుత్వం కల్పిస్తోందని విద్యార్థులకు, తల్లిదండ్రులకు స్పష్టం చేశారు.

వర్చువల్ విధానంలో 'మహానాడు'

ప్రధానమంత్రి పిలుపు మేరకు ఇంధనాన్ని మరియు ఖర్చులను పొదుపు చేయాలనే ఉద్దేశ్యంతో, ఈసారి 'మహానాడు' కార్యక్రమాన్ని వర్చువల్ విధానంలో నిర్వహించాలని ముఖ్యమంత్రి నిర్ణయించారని ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. హైబ్రిడ్ మోడల్ ద్వారా ముఖ్యమంత్రి సందేశాన్ని, రాష్ట్ర పార్టీ ఆలోచనలను అందరికీ చేరవేసేలా ఏర్పాట్లు చేస్తున్నామని, ఇది నిరంతరం పనిచేసే ప్రభుత్వ గొప్పతనానికి నిదర్శనమని ఆయన మీడియా ముఖంగా తెలియజేశారు.

# ప్రత్తిపాటి పుల్లారావు జన్మదినోత్సవం సందర్భంగా 43వ ఉచిత మెగా కంటి వైద్య శిబిరం

### లక్షల రూపాయల చికిత్సలు ఉచితం... ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి : డాక్టర్ కందిమల్ల జయమ్మ



చిలకలూరిపేట , పెన్ పవర్, మే 16 : చిలకలూరిపేట : ప్రజాసేవను ప్రధాన ధ్యేయంగా ముందుకు సాగుతున్న స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 29వ తేదీ శుక్రవారం నిర్వహించనున్న 43వ ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని వైద్య నిపుణులు పిలుపునిచ్చారు. చిలకలూరిపేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్ కందిమల్ల జయమ్మ మాట్లాడుతూ, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు కుమారుడు శరత్ ఆధ్వర్యంలో ప్రముఖ శంకర్ కంటి వైద్యశాల సహకారంతో ఈ మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గతంలో ప్రధానంగా కంటి శుక్లాల సమస్యలకు మాత్రమే పరిమితమైన వైద్య సేవలను ఈసారి మరింత విస్తృత స్థాయిలో అందిస్తున్నారని తెలియజేశారు .రెటీనా సంబంధిత వ్యాధులు, రెటీనా డిటాచ్మెంట్‌తో పాటు కంటికి సంబంధించిన పలు క్లిష్ట సమస్యలకు సైతం నిపుణులైన వైద్యులచే పూర్తిగా ఉచితంగా వైద్య సేవలు అందించనున్నట్లు వెల్లడించారు. సాధారణంగా లక్ష రూపాయలకు పైగా వ్యయం అయ్యే అత్యాధునిక చికిత్సలను నిరుపేదలకు ఉచితంగా అందించడం ఈ శిబిరం ప్రత్యేకతగా నిలుస్తుందని పేర్కొన్నారు. చిలకలూరిపేట నియోజకవర్గ ప్రజలతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు కూడా ఈ అరుదైన అవకాశాన్ని వినియోగించుకొని కంటి ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని ఆమె కోరారు. ప్రజల ఆరోగ్య సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అందిస్తున్న సేవలు అభినందనీయమని వైద్యులు కొనియాడుతూ, ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కందిమల్ల జయమ్మ మాట్లాడుతూ, ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తున్న ప్రత్తిపాటి పుల్లారావు వంటి ప్రజాప్రతినిధులు మళ్లీ మళ్లీ గెలిచి ప్రజాసేవ కొనసాగించాలని పట్టణ ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్స్ సిబ్బంది పాల్గొన్నారు.

# అత్యంత పారదర్శకంగా ఇళ్ల జాబితా ఇళ్ల గణన ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, సెన్సస్ జేడీ జి.ప్రసన్నకుమార్...



విజయవాడ, పెన్ పవర్, మే, 16, జన గణన – 2027 ప్రక్రియకు సంబంధించి దశల వారీగా ప్రక్రియ అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో జరుగుతోందని కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, సెన్సస్ జేడీ జి.ప్రసన్నకుమార్ అన్నారు. కలెక్టర్ లక్ష్మీశ, జేడీ ప్రసన్నకుమార్ శనివారం కంచికచర్లలో జరుగుతున్న ఇళ్ల జాబితా, ఇళ్ల గణన (హౌస్ లిస్టింగ్, హౌసింగ్ సెన్సస్) ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇంటింటికి వచ్చే సిబ్బందికి సరైన, పూర్తి వివరాలను తప్పనిసరిగా అందించాలని విజ్ఞప్తి చేశారు. అత్యంత కచ్చితత్వంతో దోష రహితంగా డేటాను నమోదు చేయాలని, మార్గదర్శకాల ప్రకారం జనగణన నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. జనగణన అనేది దేశ ప్రగతి, ప్రణాళికా రూపకల్పనకు అత్యంత కీలకమైన ప్రక్రియ అని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే సంక్షేమ పథకాలు, మౌలిక వసతుల అభివృద్ధి, విద్య, వైద్యం, ఉపాధి, గృహ నిర్మాణం వంటి రంగాల్లో భవిష్యత్ కార్యాచరణకు జనగణన గణాంకాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. సెన్సస్ జేడీ జి. ప్రసన్నకుమార్ మాట్లాడుతూ జనగణనలో ప్రతి సమాచారం విలువైనదని, ప్రజల సహకారంతోనే సమగ్ర గణాంకాలు సిద్ధమవుతాయని ఫీల్డ్ స్థాయిలో సిబ్బంది నిబద్ధతతో పనిచేసి నాణ్యమైన డేటా సేకరణకు కృషి చేయాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. కార్యక్రమంలో వీఎంసీ సెన్సస్ ఇంచార్జ్ వెంకటరమణ, రూరల్ ఇన్‌ఛార్జ్ స్వాతి తదితరులు పాల్గొన్నారు...

# కలుషిత త్రాగునీటి సరఫరాకు అవకాశం ఇవ్వరాదు..కమిషనర్ కె.మయూర్ అశోక్..



గుంటూరు, పెన్ పవర్, మే, 16, అనుమానిత ప్రాంతాల్లో అమ్మోనియా పరీక్షలు తప్పనిసరి ప్రతి టెస్ట్‌ను సిఎంఎం యాప్‌లో అప్‌లోడ్ చేయాలి డ్రైన్‌లో పైప్‌లైన్‌పై ఎమినిటి కార్యదర్శికి షోకాజ్ నోటీసు జారీ చేయాలని ఆదేశం నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ గుంటూరు నగరంలో ప్రజలకు స్వచ్ఛమైన త్రాగునీరు అందించడంలో రాజీ ఉండబోదని, కలుషిత త్రాగునీటి సరఫరా జరగడానికి వీల్లేదని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ స్పష్టం చేశారు. శనివారం శ్రీనగర్, శారదా కాలనీ, సంజీవయ్య నగర్, సుగాలీ కాలనీ, శివనాగరాజు కాలనీ తదితర ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించి, జరుగుతున్న అభివృద్ధి పనులు, త్రాగునీటి సరఫరా పరిశీలించి అధికారులకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలోని ప్రతి వార్డ్ సచివాలయం పరిధిలో త్రాగునీటి పైప్‌లైన్‌లకు ప్రత్యేక ఆడిట్ నిర్వహించాలని తెలిపారు. పైప్‌లైన్‌లు డ్రైనేజీ లైన్లకు సమీపంలో ఉన్న ప్రాంతాలను గుర్తించి, వెంటనే సాంకేతికంగా పరిశీలించాలని సూచించారు. సుగాలీ కాలనీలో డ్రైన్‌లో త్రాగునీటి పైప్‌లైన్ ఉండడాన్ని గుర్తించి, ప్రజారోగ్యానికి ముప్పు కలిగించే విధంగా నిర్లక్ష్యం జరిగినందుకు సంబంధిత ఎమినిటి కార్యదర్శికి షోకాజ్ నోటీసు జారీ చేయాలని ఎస్‌ఈని ఆదేశించారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. అనుమానిత ప్రాంతాల్లో తప్పనిసరిగా అమ్మోనియా టెస్టులు నిర్వహించాలని, ప్రతి రోజు నిర్వహించే నీటి నాణ్యత పరీక్షల వివరాలను సక్రమంగా నమోదు చేయాలని ఆదేశించారు. నిర్వహించిన ప్రతి ఎమినిటి టెస్ట్‌ను వెంటనే సిఎంఎం యాప్‌లో అప్‌లోడ్ చేయాలని స్పష్టం చేశారు. అధికారులు క్షేత్ర స్థాయిలో నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. శారదా కాలనీలోని రిజర్వాయర్‌ను పరిశీలించిన కమిషనర్, రిజర్వాయర్ పరిసరాల్లో ఉన్న అనవసర వస్తువులను తొలగించి పరిశుభ్రత పాటించాలని ఆదేశించారు. క్లోరిన్ పరీక్షలను క్రమం తప్పకుండా నిర్వహించి, వాటి వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలని చెప్పారు. త్రాగునీటి సరఫరా కేంద్రాలు పరిశుభ్రంగా ఉండేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇక నిర్మాణ వ్యర్థాలు రోడ్లపై పేరుకుపోకుండా వెంటనే తొలగించాలని ప్లానింగ్ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశారు. ఖాళీ స్థలాలు, కాలనీల పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. పర్యటనలో అదనపు కమిషనర్ (ఇంచార్జి) జి.సాంబశివరావు, ఎస్‌ఈ వెంకటేశ్వరరావు, ఈఈ సుందర్రామిరెడ్డి, ఎస్‌ఎస్ లు సాంబయ్య, ఐజాక్, పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

# ప్రత్తిపాటి శరత్ ఆధ్వర్యంలో 43వ మెగా కంటి వైద్య శిబిరం: తహసిల్దార్ మహమ్మద్ హుస్సేన్



చిలకలూరిపేట , పెన్ పవర్, మే 16 : చిలకలూరిపేట : మాజీ మంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 29వ తేదీ శుక్రవారం పేటలో 43వ ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు తహసిల్దార్ మహమ్మద్ హుస్సేన్ తెలిపారు. శనివారం మాట్లాడుతూ, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావుకు ముందస్తు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజాసేవను ప్రధాన ధ్యేయంగా తీసుకొని ఆయన నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు ఎంతో అభినందనీయమన్నారు. ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు కుమారుడు శరత్ ఆధ్వర్యంలో, ప్రముఖ శంకర్ కంటి వైద్యశాల సహకారంతో ఈ భారీ వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. గతంలో కేవలం కంటి శుక్లాల సమస్యలకే పరిమితమైన సేవలను, ఈసారి మరింత విస్తృతం చేసి రెటీనా సంబంధిత వ్యాధులు, రెటీనా డిటాచ్మెంట్‌తో పాటు పలు క్లిష్టమైన కంటి సమస్యలకు నిపుణులైన వైద్యులచే పూర్తిగా ఉచితంగా చికిత్స అందించనున్నట్లు పేర్కొన్నారు. సాధారణంగా బయట లక్ష రూపాయలకు పైగా ఖర్చయ్యే అత్యాధునిక చికిత్సలను ఇక్కడ నిరుపేదలకు ఉచితంగా అందించడం విశేషమన్నారు. ప్రజలకు ఒక్క రూపాయి ఖర్చు లేకుండా ఇలాంటి సేవలు అందిస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, ఆయన తనయుడు శరత్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తూ.. చిలకలూరిపేట నియోజకవర్గంతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలందరూ ఈ అరుదైన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసిల్దార్ మహమ్మద్ హుస్సేన్ తెలిపారు.

# కారంపూడి మండలంలో ప్రతినెల మూడవ శనివారం జరిగే "స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమం

### "ఈ మాసపు థీమ్ "ప్లాస్టిక్ రహిత ఆంధ్ర ప్రదేశ్ అనే అంశంపై ర్యాలీ సదస్సులు (పుష్ కార్ట్ ) ప్రారంభించిన డివిజనల్ డెవలప్మెంట్ అధికారి గబ్రు నాయక్






పెన్ పవర్ కారంపూడి మే 16 :-- కారంపూడి మండలం లో ప్రతినెల మూడవ శనివారం జరిగే " స్వర్ణాంధ్రబి స్వచ్ఛ ఆంధ్ర " కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఈ మాసపు థీమ్ " ప్లాస్టిక్ రహిత ఆంధ్ర ప్రదేశ్ " అనే అంశంపై మండలంలోని అన్ని గ్రామపంచాయతీలలో మరియు మండల పరిషత్ ఆధ్వర్యంలో ర్యాలీలు సదస్సులు నిర్వహించడం జరిగింది. స్థానిక మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద జరిగిన కార్యక్రమంలో డివిజనల్ డెవలప్మెంట్ అధికారి గబ్రు నాయక్ పాల్గొని తడి, పొడి చెత్త లను ప్రజల తమ ఇండ్లలోనే వేరుచేసి పొడి వ్యర్థాలను మండలంలో తిరిగే స్వచ్ఛ రథం కు అప్పజెప్పి నిత్యవసర సరుకులు పొందవచ్చునని, తడి చెత్తను, మిగతా వ్యర్థాలను హరిత రాయబారుల ద్వారా చెత్త నుండి సంపద సృష్టించే కేంద్రాలు ( ఎస్ డబ్ల్యూ పిసి షెడ్లు) కు తరలించి తడి చెత్త నుండి వానపాముల ఎరువు తయారుచేసి రైతులకు విక్రయిస్తారని తెలియజేశారు, మిగతా వ్యర్థాలను రీసైకిలింగ్ చేస్తారని తెలిపారు. అదేవిధంగా స్వచ్ఛ పదం కార్యక్రమం ద్వారా ప్రతి బుధవారం,ప్రతి గ్రామంలో రోడ్ల వెంబటి వ్యర్థాలను తొలగించడం జరుగుతుందని తెలిపారు. అదేవిధంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్న మండల పరిషత్ అధ్యక్షులు,శ్రీమతి బొల్లేడి కనకదుర్గ శ్రీనివాసరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం స్వచ్ఛతకు, అధిక ప్రాధాన్యత ఇస్తుందని, మాన్యశ్రీ ముఖ్యమంత్రివర్యులు చంద్రబాబు నాయుడు గారి స్వర్ణాంధ్ర సంకల్పానికి కృషిచేసి స్వర్ణాంధ్ర సాధిద్దామని తెలిపారు. అనంతరం స్వచ్ఛ ప్రతిజ్ఞ, మరియు స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ నుండి వచ్చిన తోపుడు బండ్లు ( పుష్ కార్ట్ ) మరియు నాలుగు రకాల డబ్బాలను పంచాయతీలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షులు గాడిపర్తి రమాదేవి పూర్ణయ్య, మండల పరిషత్ అభివృద్ధి అధికారి గంట శ్రీనివాస్ రెడ్డి, డిప్యూటీ ఎంపీడీవోలు కే శ్రీనివాస్ రెడ్డి, ఏం శ్రీనివాస్ రెడ్డి, ఏపీవో కట్ట నాగేశ్వరావు, ఏపీఎం రంగారెడ్డి, వైద్యాధికారి రమ్య, సిహెచ్ ఓ,మల్లయ్య, లాలు నాయక్, పంచాయతీ కార్యదర్శులు కసినియా నాయక్ తదితరులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, నాయకులు లక్ష్మీనారాయణ, నాగేశ్వరావు, స్థానిక ప్రజలుపాల్గొన్న ఈ కార్యక్రమం స్వచ్ఛభారత్ మండల కోఆర్డినేటర్ కే సుబ్బారావు ఆధ్వర్యంలో నిర్వహించబడింది.

# వేసవి శిబిరాల్లో బాలల మేధో వికాసానికి కథలు పునాది : బాల సాహిత్యపు బుచ్చిబాబు



చిలకలూరిపేట రూరల్ , పెన్ పవర్, మే 16 : ఎడ్లపాడు : బాసట సామాజిక సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో ఎడ్లపాడు, లింగారావుపాలెం గ్రామాలలో గత 15 రోజులుగా జరుగుతున్న వేసవి శిక్షణ శిబిరాలు ఎంతో ఉత్సాహంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా నిర్వహించిన 'కథలు చెప్పడం--రాయించడం' కార్యక్రమానికి ప్రముఖ బాలసాహిత్యవేత్త, 'బాల సాహిత్యపు బుచ్చిబాబు' ముఖ్య అతిథిగా విచ్చేసి విద్యార్థులకు కథల రచనలోని మెలకువలను నేర్పించారు. బాలల మేధో వికాసానికి కథలు పునాది లాంటివని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా బాసట కమిటీ సభ్యులు బొచ్చు రాజేష్.. దార్ల బుచ్చిబాబును శాలువాతో సత్కరించి, మెమొంటో బహుకరించారు. కార్యక్రమంలో బాసట కమిటీ అధ్యక్షులు నూతలపాటి కాళిదాసు, విద్యా కమిటీ కన్వీనర్ కల్లూరి వాసు, కమిటీ సభ్యులు చెరుకూరి సృజన, చెన్నుపాటి హనుమంతరావు, ముత్తవరపు విజయ్, రవీంద్ర, కేత రామబ్రహ్మం, నంబూరి శివరామకృష్ణ, కోయ రామోజీ, రావూరి సురేష్, తోకల మధు మరియు పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# అమరావతికి యుద్ధ గండం...

**విజయవాడ, మే 16 పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ ప్రజల ఐదేళ్ల నిరీక్షణ తర్వాత, కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో అమరావతి పనులు మళ్లీ పట్టాలెక్కుతున్న తరుణంలో ఊహించని గ్లోబల్ సవాళ్లు ఎదురవుతున్నాయి. అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతలు , పశ్చిమాసియాలో చెలరేగుతున్న యుద్ధ జ్వాలలు ఇప్పుడు అమరావతి నిర్మాణాల కొనసాగింపును మరోసారి ప్రశ్నార్థకం చేస్తున్నాయి. యుద్ధం కారణంగా ప్రపంచవ్యాప్తంగా సప్లై చెయిన్ దెబ్బతినడం, చమురు ధరలు పెరగడం వంటి కారణాలతో కేంద్ర ప్రభుత్వం భారీ ప్రాజెక్టులపై ఆచితూచి అడుగులు వేయాలని భావిస్తోంది. ఈ క్రమంలో అమరావతి వంటి మెగా ప్రాజెక్టుల పురోగతిపై రాజకీయ వర్గాల్లో పెద్ద ఎత్తున చర్చ మొదలైంది.ప్రస్తుత అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితిని దృష్టిలో ఉంచుకుని, భారీ నిర్మాణ పనులను కనీసం రెండేళ్ల పాటు వాయిదా వేయాలని కేంద్రం రాష్ట్రాలకు సూచించవచ్చనే ప్రచారం రాజకీయ వర్గాల్లో కలకలం రేపుతోంది. ముఖ్యంగా ప్రధాని మోదీ ప్రకటించిన ఆస్టెరిటీ పాలసీలో భాగంగా ఖర్చులను తగ్గించుకోవాలని చూస్తుండటం అమరావతికి ఇబ్బందిగా మారే అవకాశం ఉంది. ఈ ప్రచారాన్ని నీతి ఆయోగ్ తోసిపుచ్చినప్పటికీ, ఏపీలోని ప్రతిపక్షాలు దీనిని రాజకీయ అస్త్రంగా మార్చుకుంటున్నాయి. అమరావతి ఆగిపోతుందని అంటున్నారు. దీంతో రాజధాని నిర్మాణం మళ్లీ అటకెక్కుతుందా అనే ఆందోళన సామాన్య ప్రజల్లో నెలకొంది.అమరావతి నిర్మాణానికి అవసరమైన నిధుల్లో సింహభాగం ప్రపంచ బ్యాంక్ , ఆసియా అభివృద్ధి బ్యాంక్ వంటి అంతర్జాతీయ ఆర్థిక సంస్థల నుంచి రావాల్సి ఉంది. యుద్ధ పరిస్థితుల వల్ల అంతర్జాతీయ మార్కెట్లు అస్థిరంగా మారితే, ఈ రుణాల మంజూరులో జాప్యం జరిగే ప్రమాదం ఉంది. గ్లోబల్ ఎకానమీ కుదేలైతే బ్యాంకులు తమ ప్రాధాన్యతలను మార్చుకునే అవకాశం ఉంటుంది. ఇదే ఇప్పుడు చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వానికి అతిపెద్ద

తలనొప్పిగా మారింది.రాజకీయంగా చూస్తే, అమరావతిని తన ప్రతిష్టగా భావిస్తున్న చంద్రబాబుకు ఇది ఒక అగ్నిపరీక్ష. ఒకవైపు రాష్ట్రంలో ఆర్థిక వనరుల కొరత, మరోవైపు కేంద్రం నుంచి అందాల్సిన సహకారం .. ఈ రెండింటి మధ్య సమతుల్యత సాధించడం ఇప్పుడు ఆయన ముందున్న సవాల్. గతంలో పారిశ్రామికీకరణను పరుగులు పెట్టించిన అనుభవం ఉన్నప్పటికీ, ఇప్పుడు యుద్ధం వంటి బాహ్య శక్తుల ప్రభావం వల్ల ప్రాజెక్టు మందగిస్తే లక్ష్యం చేరుకోవడం ఆలస్యం అవుతుంది.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## స్ట్రాటిజిస్ట్ లుకాదు.. అస్ట్రాలిజిస్ట్స్

**విజయవాడ, మే 16 పెన్ పవర్:** రాజకీయాల్లో గెలుపు గుర్రం ఎక్కేందుకు వ్యూహకర్తలు ఇచ్చే డేటా కంటే, గ్రహగతులు మార్చే జ్యోతిష్యుల పైనే రాజకీయ నేతలు ఎక్కువ నమ్మకం పెంచుకుంటున్నట్లు కనిపిస్తోంది. ఇటీవల తమిళనాడులో విజయ్ విజయం వెనుక జ్యోతిష్యుడి హస్తం ఉందన్న ప్రచారం జోరుగా సాగుతుండటంతో, ఇప్పుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కూడా అదే బాట పట్టారు. చండీగఢ్‌కు చెందిన ప్రముఖ ఆస్ట్రాలజర్ రుద్ర కరణ్ ప్రతాప్ ప్రత్యేకంగా తాడేపల్లికి వచ్చి జగన్‌తో భేటీ కావడం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.గత ఎన్నికల్లో ఐప్యాక్ వంటి వ్యూహకర్తలను నమ్ముకున్న జగన్, ఈసారి మాత్రం గ్రహబలంపైనే భారం వేసినట్లు కనిపిస్తోంది. చండీగఢ్ నుంచి రుద్ర కరణ్ ప్రతాప్‌ను ప్రత్యేకంగా తాడేపల్లికి రప్పించడం వెనుక బలమైన కారణాలే ఉన్నాయని వైసీపీ శ్రేణులు చర్చించుకుంటున్నాయి. రాజకీయ నాయకుల అవసరాలకు అనుగుణంగా జ్యోతిష్యం చెప్పడంలో రుద్ర కరణ్ సిద్ధహస్తుడని పేరుంది. తన పర్యటనకు సంబంధించిన వివరాలను సదరు జ్యోతిష్యుడు సోషల్ మీడియాలో స్వయంగా పంచుకోవడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది.నిజానికి, 2024 ఎన్నికల్లో జగన్ ఘనవిజయం సాధిస్తారని రుద్ర కరణ్ ప్రతాప్ గతంలోనే జోస్యం చెప్పారు. అయితే ఆ అంచనాలు క్షేత్రస్థాయిలో తలకిందులయ్యాయి. అయినప్పటికీ, జగన్ ఆయనపై నమ్మకం కోల్పోకుండా మళ్ళీ పిలిపించి చర్చలు జరపడం గమనార్హం. కేవలం రాజకీయ భవిష్యత్తే కాకుండా, ప్రస్తుతం ఎదుర్కొంటున్న న్యాయపరమైన చిక్కులు, వ్యక్తిగత జాతక దోషాల నివారణ కోసం కూడా ఈ భేటీ జరిగినట్లు తెలుస్తోంది. స్ట్రాటజిస్టులు ఇచ్చే లెక్కలు ఒక్కోసారి తప్పవచ్చు కానీ, సరైన జ్యోతిష్యుడి సాయంతో గ్రహాలను అనుకూలం చేసుకోవచ్చని జగన్ భావిస్తున్నట్లు సమాచారం.తమిళనాడులో విజయ్ పార్టీ పెట్టిన అతి తక్కువ కాలంలోనే అధికారంలోకి రావడానికి ఆయన వ్యక్తిగత జ్యోతిష్యుడు ఇచ్చిన సలహాలే కారణమనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఈ విజయ్ ఫార్ములా ను చూశాక, జగన్ కూడా పొలిటికల్ స్ట్రాటజిస్టుల కంటే ఆస్ట్రాలజిస్టులే బెటర్ అనే ముగింపుకు వచ్చినట్లు కనిపిస్తోంది. అందుకే తాడేపల్లి ప్యాలెస్‌లో ఇప్పుడు పొలిటికల్ డేటా కంటే, జాతక చక్రాలు, గ్రహాల సంచారంపైనే ఎక్కువ చర్చలు జరుగుతున్నాయి. జ్యోతిష్యుడి సలహాలు జగన్ జాతకాన్ని ఎంతవరకు మారుస్తాయో వేచి చూడాలి.

## భారీ మెజార్టీపై నేతలు కన్ను

**విశాఖపట్టణం, మే 16 పెన్ పవర్:** టిడిపిలోనే కొందరు నాయకులకు మెజారిటీ సమస్య ఇప్పుడు కొంత గడబిడగా మారింది. గత ఎన్నికల సమయంలో భారీ స్థాయి మెజారిటీతో విజయం దక్కించుకున్న చాలామంది ఎమ్మెల్యేలు ఉన్నారు. ఉదాహరణకు గాజువాక నియోజకవర్గంలో టిడిపి ప్రస్తుత రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఊహించని మెజారిటీని సాధించారు. అదేవిధంగా మంగళగిరి నియోజకవర్గంలో మంత్రి నారా లోకేష్ కూడా 90 వేల పైచిలుకు మెజారిటీని దక్కించుకున్నారు. ఇలా రాష్ట్రవ్యాప్తంగా చాలా మంది నాయకులు భారీ మెజారిటీని సొంతం చేసుకున్నారుఅయితే ఆ సమయంలో కూటమి ప్రభావంతో పాటు వైసిపి వ్యతిరేకత తీవ్ర స్థాయిలో కనిపించింది. దీనివల్లే వీరికి అనూహ్యమైన మెజారిటీ దక్కిందన్న వాదన ఉంది. వచ్చే ఎన్నికల నాటికి ఇదే ప్రభావం కనిపిస్తుందా.. లేకపోతే వచ్చే ఎన్నికల నాటికి పరిస్థితి మారుతుందా.. అనేది ఇప్పుడు కొంతమంది నాయకులలో చర్చనీయాంశంగా మారింది. దీంతో తమ మెజారిటీని తగ్గకుండా చూసుకునేందుకు కొంతమంది ప్రయత్నాలు చేస్తున్నారు.గత ఎన్నికల సమయంలో ఏఏ మండలాల్లో తమకు ఎక్కువగా ఓట్లు పడ్డాయి.. ఏ ఏ సామాజిక వర్గాల నుంచి తమకు ఓట్లు భారీ సంఖ్యలో పడ్డాయి.. అనే విషయాన్ని ప్రత్యేకంగా పరిశీలిస్తున్నారు. తద్వారా ఆయా మండలాలు, ఆయా సామాజిక వర్గాలను మరింత మంచి చేసుకుని వచ్చే ఎన్నికల సమయానికి తమకు మెజారిటీ పెంచుకోవడంతో పాటు ఒకవేళ పెరిగినా పెరగకపోయినా తమ మెజారిటీని తగ్గకుండా చూసుకునేందుకు నాయకులు ప్రయత్నాలు చేయాలని భావిస్తున్నారు.ముఖ్యంగా గాజువాక నియోజకవర్గంలో పల్లా శ్రీనివాసరావు ఇటీవల పర్యటనలు చేస్తున్నారు. తన సామాజిక వర్గం నాయకులతో పాటు క్షేత్రస్థాయిలో కార్యకర్తలను కూడా మమేకమవుతున్నారు. మెజారిటీ తగ్గకుండా చూడాలని ఆయన పదేపదే చెబుతున్నారు. గెలుపు అనేది ఖాయమే అయినప్పటికీ మెజారిటీ ఇప్పుడు ప్రతిష్టాత్మక అంశంగా మారింది. ఇక మంగళగిరి నియోజకవర్గంలో నారా లోకేష్ కూడా ఇదే ప్రయత్నాలు చేస్తున్నారు. తనను ఎవరు కలిసినా మెజారిటీపైనే దృష్టి పెట్టాలని ఆయన చెబుతున్నారు.ఈ రెండు నియోజకవర్గాలే కాదు రాష్ట్రవ్యాప్తంగా భారీ మెజారిటీ దక్కించుకున్న నాయకులంతా ఇదే పనిపై దృష్టి పెట్టడం విశేషం. మరి వీరు అనుకున్నట్టుగా మెజారిటీ కొనసాగుతుందా లేకపోతే తగ్గుతుందా అనేది చూడాలి. ప్రస్తుతానికైతే మెజారిటీ తగ్గకుండా చూసుకునేందుకు తీవ్ర స్థాయిలో ప్రయత్నాలు చేస్తున్నారు. దీనికిగాను సంక్షేమ పథకాల అమలతో పాటు ప్రభుత్వం ఇచ్చిన హామీలను కూడా అమలు చేసే దిశగా అడుగులు వేస్తున్నారు.

## తిరుమలలో గంటకు 10 వేల మంది దర్శనం

**తిరుమల, మే 16 పెన్ పవర్:** కలియుగ దైవం శ్రీవేంకటేశ్వర స్వామి దర్శనం ఇప్పుడు సులభతరంగా మారింది. టీడీపీ నేతృత్వంలోని కూటమి సర్కారు చేపట్టిన సరికొత్త చర్యల వల్ల వేలాది మంది భక్తులకు ఇప్పుడు కేవలం గంటల వ్యవధిలోనే స్వామి వారి దర్శన భాగ్యం కలుగుతోంది. వెరసి గతంలో గంటల తరబడి క్యూ లైన్లలో నిలవాల్సిన పరిస్థితి ఇప్పుడు కనిపించడం లేదు.అదే సమయంలో దూర ప్రాంతాల నుంచి వస్తున్న భక్తులకు విడిది సౌకర్యం లభ్యత కూడా బాగా పెరిగింది. ఇందుకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అందుబాటులోకి తెచ్చిన ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ (ఐసీసీసీ) వ్యవస్థ దోహదం చేస్తోందని చెప్పాలి.ఈ నెల 2న తిరుమల వెంకన్నను 91 వేల మంది దాకా దర్శనం చేసుకున్నారు. వీరందరికీ కేవలం 12 గంటల్లోనే స్వామి వారి దర్శనం కల్పించిన టీటీడీ సత్తా చాటింది. తాజాగా బుధవారం 80 వేల మంది స్వామి వారిని దర్శించుకోగా... వారికి కేవలం 8 గంటల్లోనే స్వామి వారి దర్శనం కల్పించిన టీటీడీ సరికొత్త రికార్డు నమోదు చేసింది.అంటే.... గంటకు 10 వేల మంది చొప్పున స్వామి వారిని దర్శించుకునేలా టీటీడీ చర్యలు చేపట్టింది. గతంలో ఇదే 80 వేల మంది స్వామి వారిని దర్శించుకోవాలంటే 18 నుంచి 24 గంటల సమయం పట్టేది. ఇప్పుడు ఐసీసీసీ వల్ల కేవలం ఓ గంటలోనే 10 వేల మందికి స్వామి వారి దర్శనం లభిస్తోంది.కేవలం అతి స్వల్ప వ్యవధిలోనే స్వామి వారి దర్శనం లభిస్తున్న నేపథ్యంలో తిరుమలలో విడిది గదులను బుక్ చేసుకుంటున్న భక్తులు.. దర్శనం వెంటనే వాటిని ఖాళీ చేస్తున్నారు. ఫలితంగా తిరుమల కొండపై విడిది గదుల కొరత అన్న సమస్యల ఉత్పన్నం కావడం లేదు.స్వామి వారి దర్శనం కోసం వస్తున్న దాదాపు అందరు భక్తులకూ విడిది గదులు లభిస్తున్నాయని చెప్పాలి. గతంలో అయితే గదుల కోసం భక్తులు సుదీర్ఘ కాలం పాటు వేచి చూడాల్సి వచ్చేది. అయితే ఇప్పుడు త్వరితగతిన దర్శనాలు పూర్తి అవుతున్న నేపథ్యంలో గదుల లభ్యత కూడా బాగా పెరిగింది.

# టీడీపీ కొత్త ప్రచారం




**ఒంగోలు, మే 16 పెన్ పవర్:**
తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో పరిశీలించిన తర్వాత ఏపీలో అనేక మార్పులు వస్తాయన్న వాదన బలంగా వినిపిస్తోంది. ప్రధానంగా గత ప్రభుత్వాల పథకాలను అమలు చేస్తామని హామీ ఇచ్చిన పార్టీలకు మాత్రమే తమిళనాడు అసెంబ్లీలో చోటు దక్కింది. కానీ ఏపీ విషయానికి వచ్చేసరికి గత ప్రభుత్వాలు అమలు చేసిన పథకాలను జగన్ వచ్చిన తర్వాత 2019 -24 మధ్య రద్దు చేశారు. వీటిలో ప్రధానంగా అన్నా క్యాంటీన్, షాదీ ముబారక్ వంటి కీలక పథకాలు ఉన్నాయి. అదే విధంగా ఉన్నత విద్యను అభ్యసించే వారికి విదేశాలకు వెళ్లే సదుపాయాన్ని కూడా దాదాపు తీసేశారు. ఇవన్నీ వైసీపీ ప్రభుత్వానికి తీవ్ర ఇబ్బందులు కలిగించాయి. అదే సమయంలో టిడిపికి అనుకూల ఓటు బ్యాంకు ను పెంచాయి. దీనిని గమనించిన చంద్రబాబు వైసీపీ అమలు చేసిన పథకాలను కొనసాగిస్తామని గత ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు. అలాగే వాటిని కొనసాగిస్తున్నారు. ఉదాహరణకు అమ్మఒడి పేరుతో వైసిపి హయంలో అమలు చేసిన పథకాన్ని తల్లికి వందనం పేరుతో మరింత బలంగా ప్రజల్లోకి తీసుకువెళ్లారుఅదే విధంగా రైతు భరోసా పేరుతో వైసిపి అమలు చేసిన పథకాన్ని అన్నదాత సుఖీభవ పేరుతో అమలు చేస్తున్నారు. అదే సమయంలో అన్న క్యాంటీన్లను తిరిగి తెరిచారు. రాష్ట్రవ్యాప్తంగా వీటిని మరింత పెంచాలని కూడా భావిస్తున్నారు. వీటికి తోడు విదేశీ రుణాలు, షాదీ ముబారక్ వంటి పథకాలను కూడా పునరుద్ధరించారు. ఇక ఇప్పుడు వైసీపీ పరిస్థితి ఏంటి అనేది ప్రశ్నార్థకంగా మారుతుంది. టిడిపి అమలు చేస్తున్న పథకాలను కొనసాగిస్తారా అంటే తమ విధానాలు తమకు ఉన్నాయని ఇటీవల బొత్స సత్యనారాయణ వ్యాఖ్యానించారు. దీన్ని బట్టి టిడిపి అమలు చేస్తున్న పథకాలు వైసీపీ వస్తే తీసేసే ప్రమాదం ఉందన్నది స్పష్టమవుతుంది. ఇది ఎన్నికల సమయంలో స్పష్టంగా ఆ పార్టీకి ఇబ్బందికర పరిణామాలు సృష్టించడం ఖాయం అవుతుంది. వీటిని టార్గెట్గా చేసుకుని టిడిపి ఇప్పుడు ప్రచారం చేయాలని నిర్ణయించుకుంది. ప్రస్తుతం అమలవుతున్న పథకాలను వచ్చే ఎన్నికల్లో వైసీపీ గెలిస్తే పూర్తిగా రద్దు చేస్తుందని ప్రధానంగా మహిళలకు ఉచితంగా అమల్లోచేస్తున్న బస్సు ప్రయాణాలు రద్దవుతాయని చెప్పనుంది. అదేవిధంగా సూపర్ సిక్స్ పథకాలను కూడా రద్దు చేస్తారని ప్రచారం చేయాలని టిడిపి నిర్ణయించింది. తద్వారా వైసిపిని అడ్డుకునేందుకు సాధ్యమైనన్ని వ్యూహాలను అమలు చేయాలని టిడిపి నాయకత్వం ఒక నిర్ణయానికి వచ్చింది. మహానాడు వేదికగా దీనికి సంబంధించి ప్రకటన చేయనున్నారు. ఎలా చూసుకున్నప్పటికీ ప్రజల్లో విస్తృతంగా ఉన్న కొన్ని పథకాల విషయంలో వైసిపి మారకపోతే కష్టం అనే భావన వినిపిస్తోంది.

**పెమ్మసాని ప్లాన్ తో గుంటూరు...**

గుంటూరు నగర అభివృద్ధిని పరుగులు పెట్టించే దిశగా మరో అడుగు పడింది. ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న పట్టాభిపురం రైతు బజార్ నూతన హైటెక్ భవన నిర్మాణానికి కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గల్లా మాధవిలతో కలిసి ఘనంగా భూమి పూజ చేశారు. నిత్యం వేలాది మందితో కిటకిటలాడే ఈ మార్కెట్‌ను కార్పొరేట్ స్థాయి వసతులతో ఆధునీకరించేందుకు ఈ మెగా ప్రాజెక్టును చేపట్టారు.వినియోగదారులకు, వ్యాపారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా దాదాపు రూ. 6 కోట్ల భారీ వ్యయంతో, సుమారు 11,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ నూతన రైతు బజార్‌ను నిర్మించనున్నారు. అత్యంత ఆధునిక సాంకేతికతతో గ్రౌండ్ ఫ్లోర్ తో పాటు రెండు అంతస్తుల భవనంగా ఇది రూపుదిద్దుకోనుంది. ఎండ, వానల నుండి రక్షణ కల్పిస్తూ పూర్తి హైజీనిక్ వాతావరణంలో కూరగాయలు కొనుగోలు చేసేలా ఈ ప్లాన్ డిజైన్ చేశారు. ఈ నూతన మల్టీ-లెవెల్ భవనంలో మొత్తం 100 అత్యాధునిక షాపులను ఏర్పాటు చేస్తున్నారు.సామాజిక, ఆర్థిక సమతుల్యతను పాటిస్తూ ఈ షాపుల కేటాయింపులో స్పష్టమైన ప్రణాళికను ప్రకటించారు. 60 షాపులను, నేరుగా గ్రామాల నుండి వచ్చే అసలైన రైతులకు కేటాయిస్తారు. 30 షాపులను స్వయం సహాయక బృందాలకు చెందిన డ్వాక్రా ( మహిళా వ్యాపారులకు కేటాయిస్తారు. మిగిలిన షాపులను ఇతర నిత్యావసర వస్తువుల విక్రయదారులకు కేటాయించనున్నారు. కేవలం షాపులే కాకుండా, కస్టమర్ల సౌకర్యార్థం ఈ భవనంలో అధునిక పార్కింగ్ సౌకర్యం, స్వచ్ఛమైన తాగునీరు, అత్యాధునిక టాయిలెట్స్ మరియు హైజీన్ వసతులను కల్పిస్తున్నారు.ఈ సందర్భంగా కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ.. "గత పాలకుల తీవ్ర నిర్లక్ష్యం వల్లే ఈ భవన నిర్మాణం ఇన్నాళ్లూ జాప్యం అయ్యింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆశయాలకు అనుగుణంగా రైతులకు, వినియోగదారులకు ఒకే చోట మేలు చేయడమే మా లక్ష్యం" అని స్పష్టం చేశారు. అంతేకాకుండా, కేవలం 9 నెలల రికార్డు కాలంలోనే ఈ భవన నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు.

# సౌత్ పై జనసేన ఫోకస్...




**గుంటూరు, మే 16 పెన్ పవర్:**
జనసేనాని పవన్ కళ్యాణ్ తన పార్టీని కేవలం ఆంధ్రప్రదేశ్‌కే పరిమితం చేయకుండా పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, కేరళ, తమిళనాడులకు విస్తరించే పనిలో పడ్డారు. ఇప్పటికే కేరళకు చెందిన పలువురు సామాజిక కార్యకర్తలు, కర్ణాటక నుంచి మాజీ ఎమ్మెల్యేలు జనసేన తీర్థం పుచ్చుకోవడం ఆ పార్టీ నేషనల్ ఇమేజ్ ను పెంచింది. ఎన్డీయే కూటమిలో కీలక నేతగా ఎదిగిన పవన్, దక్షిణాది రాష్ట్రాల ఉమ్మడి గొంతుకగా మారాలని భావిస్తున్నారు. అయితే, ఇతర రాష్ట్రాల్లో విస్తరణ వేగంగా జరుగుతున్నా, సొంత గడ్డ ఏపీలో పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడంపై ఆయన అడుగులు చాలా నెమ్మదిగా పడుతున్నాయనే చర్చ జోరుగా సాగుతోంది.ఎన్నికలు ముగిసి నెలలు గడుస్తున్నా జనసేనలో ఇప్పటికీ పూర్తిస్థాయి జిల్లా, మండల కమిటీల నియామకం జరగకపోవడం క్యాడర్‌ను కొంత అసహనానికి గురిచేస్తోంది. కూటమి ప్రభుత్వంలో పవన్ కళ్యాణ్ ఉప ముఖ్యమంత్రిగా బిజీగా ఉండటం ఒక కారణమైతే, అర్హులైన వారికే పదవులు దక్కాలనే పట్టుదల మరొక కారణం. అయితే, క్షేత్రస్థాయిలో కమిటీలు లేకపోవడం వల్ల ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలోనూ, టీడీపీ-బీజేపీ నేతలతో సమన్వయం చేసుకోవడంలోనూ జనసైనికులు కొంత ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ జాప్యం వల్ల ద్వితీయ శ్రేణి నాయకత్వంలో గందరగోళం నెలకొంది.జనసేన బలోపేతానికి మరో పెద్ద అడ్డంకి.. పార్టీలోకి కొత్తగా వచ్చి చేరుతున్న వారితో పాటు సోషల్ మీడియా వేదికగా హడావుడి చేస్తున్న కొందరు కార్యకర్తలు. అధికారంలోకి వచ్చాక యాక్టివ్ అయిన వారు ఇప్పుడు నామినేటెడ్ పదవుల కోసం తీవ్రంగా ఒత్తిడి తెస్తున్నారు. పదవులు రాకపోతే కూటమి ప్రభుత్వంపై, సొంత నాయకత్వంపైనే విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ ధోరణిని పవన్ కళ్యాణ్ తీవ్రంగా పరిగణిస్తున్నట్లు సమాచారం. అందుకే, అడ్వాంటేజ్ కోసం వచ్చే వారిని కాకుండా, పదేళ్ల పాటు పార్టీని నమ్ముకున్న వారికే ప్రాధాన్యత ఇవ్వాలని భావిస్తున్న ఆయన.. బాధ్యతల అప్పగింతలో ఆచితూచి అడుగులు వేస్తున్నారు.టీడీపీతో కలిసి ప్రభుత్వం నడుపుతున్న తరుణంలో, ఎక్కడ ఏ చిన్న తేడా వచ్చినా అది కూటమి పునాదులకే దెబ్బ తగులుతుందని పవన్ భావిస్తున్నారు. అందుకే పార్టీ పరంగా దూకుడు తగ్గించి, పరిపాలనపై ఎక్కువ దృష్టి పెట్టారు. అయితే, ఇదే సమయంలో టీడీపీ తన గ్రామ స్థాయి కమిటీలను పటిష్టం చేసుకుంటుంటే, జనసేన వెనుకబడిపోతోందనే ఆందోళన పార్టీ కార్యకర్తల్లో ఉంది. ముఖ్యంగా నియోజకవర్గాల ఇన్-ఛార్జుల విషయంలో ఇంకా స్పష్టత రాకపోవడం వల్ల కూటమి పార్టీల మధ్య సమన్వయ లోపం కనిపిస్తోంది.ఇతర రాష్ట్రాల్లో పార్టీని విస్తరించడం వల్ల జాతీయ స్థాయిలో జనసేనకు లభించే గుర్తింపు, భవిష్యత్తులో ఏపీలో పార్టీ ఎదుగుదలకు ప్లస్ అవుతుందని ఆయన నమ్ముతున్నారు. పవన్ కళ్యాణ్ రాజకీయం ఇప్పుడు ఎక్కువ మంది చేరడం నిబద్ధత కలిగిన నేతలు వైపు మళ్లింది. ఈ క్రమంలో జరిగే జాప్యం క్యాడర్‌కు ఇబ్బందిగా అనిపించినా, దీర్ఘకాలంలో ఇది పార్టీకి మేలు చేస్తుందని జనసేన అగ్ర నాయకత్వం వాదిస్తోంది. జనసేన పూర్తిస్థాయి కమిటీలతో సరికొత్త రూపం సంతరించుకుంటుందో లేదో వేచి చూడాలి.

# ఫైనల్‌కి దూసుకెళ్లిన సాత్విక్- చిరాక్ జోడి..



**హైదరాబాద్ పెన్ పవర్:** థాయ్‌లాండ్ ఓపెన్ ప్రపంచ టూర్ సూపర్-500 టోర్నమెంట్ లో భారత స్టార్ పురుషుల డబుల్స్ జోడీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్‌శెట్టి అద్భుత ప్రదర్శనలు కనబరుస్తోంది. ఈరోజు (2026, మే16న) ఉత్కంఠభరితంగా కొనసాగిన సెమీ ఫైనల్ పోరులో మలేషియా జోడీ గో జెఫీ-నూర్ ఇజ్జుద్దీన్‌పై 19--21, 22-20, 21-16 తేడాతో సాత్విక్ - చిరాక్ ఘన విజయం సాధించి ఫైనల్‌కు దూసుకెళ్లారు. ఈ సీజన్‌లో తొలి ఫైనల్ బెర్త్‌ను ఖాయం చేసుకున్న జోడీగా అవతరించింది.

ప్రపంచ నంబర్ 4 ర్యాంక్‌లో ఉన్న ఇండియన్ జోడీ 19-21, 22-20, 21-16 తేడాతో మలేషియాపై గెలిచింది. గంటా 22 నిమిషాల పాటు జరిగిన ఈ ఫైట్ లో సాత్విక్ -- చిరాక్ జోడీ అద్భుత పోరాట పటిమ కనబరిచారు. ఈ గెలుపుతో మలేషియా జోడీపై తమ హెడ్-టు-హెడ్ రికార్డును 8-2కు పెంచుకుంది. పీవీ సింధు, లక్ష్యసేన్ ఇప్పటికే ఈ టోర్నీ నుంచి నిష్క్రమించినప్పటికీ.. భారత్ ఆశలన్నీ ఈ జోడీపైనే నెలకొన్నాయి. కాగా తొలి సెట్‌ను మలేషియా ఆటగాళ్లు గో జెఫీ-నూర్ ఇజ్జుద్దీన్ 20--19 తేడాతో కైవసం చేసుకున్నారు. ఆ తర్వాత అద్భుతంగా పుంజుకున్న ఇండియన్ జోడీ రెండో సెట్‌ను 22-20తో దక్కించుకుంది. మ్యాచ్‌ను తేల్చే మూడో సెట్‌లో గెలుపు కోసం ఇరు జట్లూ తీవ్రంగా కష్టపడ్డాయి. కానీ సాత్విక్- చిరాక్ జంట అద్భుతమైన ప్రదర్శనతో 21- 16తో సెట్‌ను గెలిచి.. ఫైనల్‌కు దూసుకుపోయింది.

# ఈడెన్ గార్డెన్స్‌లో కేకేఆర్ బ్యాటర్ల సిక్సర్ల వర్షం... గుజరాత్ ముందు కొండంత లక్ష్యం



ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 సీజన్‌లో భాగంగా గుజరాత్ టైటాన్స్‌తో మ్యాచ్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్ బ్యాటర్లు పరుగుల సునామీ సృష్టించారు. సొంత మైదానం ఈడెన్ గార్డెన్స్‌లో టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన కేకేఆర్, నిర్ణీత 20 ఓవర్లలో కేవలం 2 వికెట్ల నష్టానికి 247 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది. దీంతో గుజరాత్ ముందు 248 పరుగుల కొండంత లక్ష్యాన్ని ఉంచింది.ఓపెనర్ ఫిన్ అలెన్ ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. గుజరాత్ బౌలర్లపై ఆరంభం నుంచే ఎదురుదాడికి దిగి సిక్సర్ల వర్షం కురిపించాడు. కేవలం 35 బంతుల్లో 4 ఫోర్లు, 10 భారీ సిక్సర్లతో 93 పరుగులు చేసి తృటిలో శతకాన్ని చేజార్చుకున్నాడు. కెప్టెన్ అజింక్యా రహానే (14) విఫలమైనప్పటికీ, అలెన్ విధ్వంసం కేకేఆర్ కు బలమైన పునాది వేసింది.వన్ డౌన్ లో వచ్చిన యువ బ్యాటర్ అంగ్ క్రిష్ రఘువంశీ, ఆఖర్లో కామెరాన్ గ్రీన్ కూడా అదే జోరును కొనసాగించారు. వీరిద్దరూ అజేయ అర్ధ శతకాలతో మెరిశారు. రఘువంశీ 44 బంతుల్లో 4 ఫోర్లు, 7 సిక్సర్లతో 82 పరుగులు చేయగా, కామెరాన్ గ్రీన్ 28 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్సర్లతో 52 పరుగులు సాధించి అజేయంగా నిలిచారు. వీరిద్దరి దూకుడుతో కోల్‌కతా స్కోరు 240 దాటింది.మరోవైపు, టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న గుజరాత్ టైటాన్స్ నిర్ణయం పూర్తిగా బెడిసికొట్టింది. మహమ్మద్ సిరాజ్, సాయి కిశోర్ చెరో వికెట్ పడగొట్టినప్పటికీ, బౌలర్లందరూ ధారాళంగా పరుగులు సమర్పించుకున్నారు. ముఖ్యంగా స్టార్ స్పిన్నర్ రషీద్ ఖాన్ 4 ఓవర్లలో ఏకంగా 57 పరుగులు ఇవ్వడం గమనార్హం.

# ఆ ఒక్క తప్పుతోనే లక్నో చేతిలో ఓటమి.. ప్లేఆఫ్స్ రేసును సంక్లిష్టం చేసుకున్న CSK



**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ 2026 సీజన్ చివరి దశకు చేరుకున్న వేళ చెన్నై సూపర్ కింగ్స్ (జూఖ) జట్టుకి ఊహించని షాక్ తాకింది. ప్లేఆఫ్స్ రేసు నుంచి ఇప్పటికే నిష్క్రమించి, ఎలాంటి ఒత్తిడి లేకుండా ఆడుతున్న లక్నో సూపర్ జెయింట్స్ (లూ+) చేతిలో చెన్నై ఘోర పరాజయాన్ని చవి చూసింది. ఈ ఓటమితో సీఎస్కే పాయింట్ల పట్టికలో ఆరో స్థానానికి పడిపోవడమే కాకుండా, తమ ప్లేఆఫ్స్ అవకాశాలను మరింత కఠినతరం చేసుకుంది.

**జట్టు ఎంపికలో తప్పిదాలు:**

కీలకమైన మ్యాచులో చెన్నై సూపర్ కింగ్స్ మేనేజ్‌మెంట్ తీసుకున్న కొన్ని నిర్ణయాలు జట్టు కొంపముంచాయని మాజీ క్రికెటర్లు అభిప్రాయ పడుతున్నారు. గాయపడిన జేమీ ఓవర్టన్ స్థానంలో స్పెన్సర్ జాన్సన్‌ను టీమ్ లోకి తీసుకున్నారు. కానీ లక్నో పిచ్ పరిస్థితుల దృష్ట్యా అద్భుతమైన ఫాంలో ఉన్న స్పిన్నర్ అకీల్ హుసేన్ ని పక్కన పెట్టడం మైనస్‌గా మారింది. మరో స్పిన్నర్ నూర్ అహ్మద్ ఒకవైపు రన్స్ ని కట్టడి చేసినా, అతనికి తోడుగా అకీల్ హుసేన్ ఉండి ఉంటే (కనీసం ఇంపాక్ట్ ప్లేయర్‌గా) లక్నో బ్యాటర్లపై ఒత్తిడి పెంచే ఛాన్స్ ఉండేది.

**అన్షుల్ కాంబోజ్ చెత్త రికార్డు!:**

ఈ సీజన్‌లో సీఎస్కే తరఫున అత్యధిక వికెట్లు తీసి, పర్పుల్ క్యాప్ రేసులో దూసుకుపోతున్న అన్షుల్ కాంబోజ్ కి లక్నోతో జరిగిన మ్యాచ్ ఒక పీడకలగా మిగిలిపోయింది. లూ+ బ్యాటర్లు అతడిని పూర్తిగా టార్గెట్ చేశారు. ఇన్నింగ్స్ 5వ ఓవర్ వేసిన కాంబోజ్ బౌలింగ్‌లో మిచెల్ మార్ష్ ఏకంగా 4 సిక్సర్లు కొట్టాడు. అలాగే 17వ ఓవర్లో బౌలింగ్‌కు వచ్చిన కాంబోజ్‌ను నికోలస్ పూరన్ ఓ ఆట ఆడుకున్నాడు. మొదటి 4 బంతుల్లోనే 4 సిక్సర్లు కొట్టి మ్యాచ్‌ను కంప్లీట్ చేసేశాడు. దీంతో ఐపీఎల్ చరిత్రలోనే ఒకే మ్యాచ్‌లో, రెండు వేర్వేరు ఓవర్లలో నాలుగేసి సిక్సర్లు (మొత్తం 8 సిక్సర్లు) సమర్పించుకున్న ఏకైక బౌలర్‌గా కాంబోజ్ చెత్త రికార్డుని మూటగట్టుకున్నాడు. కేవలం 2.4 ఓవర్లలోనే 63 రన్స్ సమర్పించి సీఎస్కే ఓటమికి కారణమయ్యాడు.

**సీఎస్కే ప్లేఆఫ్స్ సమీకరణాలు:**

ప్రస్తుతం 12 మ్యాచులు ఆడిన చెన్నై 6 విజయాలు, 6 ఓటములతో పాయింట్ల పట్టికలో 6వ స్థానంలో కొనసాగుతుంది. చెన్నై ఇంకా 2 లీగ్ మ్యాచులు ఆడాల్సి ఉంది. మే 18: సన్‌రైజర్స్ హైదరాబాద్ (రా=ఎ)తో రసవత్తర పోరు ఉండగా.. మే 21: గుజరాత్ టైటాన్స్ (GT)తో చివరి లీగ్ మ్యాచ్ ఆడబోతుంది.

**సీఎస్కే ప్లేఆఫ్స్ చేరాలంటే?:**

చెన్నై సూపర్ కింగ్స్ కచ్చితంగా ఈ రెండు మ్యాచుల్లోనూ భారీ రన్‌రేట్‌తో గెలవాల్సి ఉంది. అలా గెలిచినా కూడా ఇతర జట్ల (ముఖ్యంగా టాప్-4 రేసులో ఉన్న జట్ల) గెలుపోటములపై ఆధారపడాల్సి ఉంటుంది. ఇందులో ఒక్క మ్యాచ్ ఓడినా చెన్నై ప్లేఆఫ్స్ ఆశలు గల్లంతయినట్లే!.. టోర్నీ నుంచి నిష్క్రమిస్తుంది.

# ఇండిపెండెంట్ మ్యూజిక్‌తోనూ అద్భుతాలు!



అవ్నీత్ కౌర్: గ్లామర్ మరియు ప్రతిభను మిళితం చేసిన రైజింగ్ స్టార్



డిజిటల్ యుగంలో సక్సెస్ అవ్వడానికి ట్యాలెంట్ ఉంటే చాలు. ప్రత్యేకించి సినిమా రంగంలో స్థిరపడాలనుకునే వారికి డిజిటల్ మాధ్యమాలు ఎంతగా దోహదపడుతున్నాయో తెలిసిందే. ట్యాలెంట్ ను ప్రూవ్ చేసుకుంటూ ఒక్క వీడియో చేస్తే చాలు.. అది చేరాల్సిన వారికి చేరితో ప్రతిభను గుర్తించి పిలిచి మరీ అవకాశాలిస్తోన్న రోజులివి.ఈ మధ్య కాలంలో అలా వెలుగులోకి వస్తోన్న సంగీత దర్శకుల సంఖ్య అంతకంతకు పెరుగుతోంది.ఇండిపెండెంట్ సంగీతానికి కూడా శ్రోతలను విశేషంగా అలరిస్తోంది. ఈ క్రమంలోనే ప్రముఖ సింగర్ కయాన్ ఇండిపెండెంట్ మ్యూజిక్ సాధిస్తున్న పురోగతి గురించి ఆసక్తికర విషయాలను వెల్లడించారు.స్వతంత్ర సంగీతానికి అద్భుతమైన సమయం నడుస్తోంది. గతంలో సినిమా పాటల నీడలో మరుగున పడిపోయిన ఇండిపెండెంట్ కళాకారులకు డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా ప్రపంచవ్యాప్త గుర్తింపు లభిస్తోందన్నారు. -మనం ఇప్పుడు గ్లోబల్ విలేజ్‌లో ఉన్నాం. ఇక్కడ సంగీతం ఒక ప్రాంతానికే పరిమితం కాదు. ఆధునిక బీట్స్ కలయికతో వస్తోన్న పాటలను ప్రపంచవ్యాప్తంగా ఆదరిస్తున్నారన్నారు. ఇలాంటి ఎలాంటి ఒత్తిళ్లకు గురవుతున్నారో కూడా వివరించారు. సింగర్‌ను , మ్యుజీషియన్‌ను ఒకే రకమైన శైలికి పరిమితం చేయాలని చూడటం సరికాదని కయాన్ అన్నారు.తాను ఎప్పుడూ రొటీన్ పద్ధతులకు లొంగిపోలేదని నచ్చిన రీతిలో ప్రయోగాలు చేయడానికే ఇష్టపడతానన్నారు. ఇండస్ట్రీ నిర్దేశించిన ఫార్ములాలను పాటించకుండా స్వంత అభిరుచితో చేసినప్పుడే నిజమైన కళాఖండాలు పుడతాయని కయాన్ వెల్లడించారు. కానీ స్వతంత్ర కళాకారిణిగా నిలదొక్కుకోవడం అంత సులభం కాదన్నారు. ఇందులో ఎన్నో సవాళ్లు ఎదురవుతుంటాయి. వాటిని అధిగమించి ప్రయాణం చేయాల్సి ఉంటుందుందన్నారు. కానీ ప్రేక్షకుల నుంచి లభిస్తున్న స్పందన చూస్తుంటే? ఎలాంటి ఒత్తిళ్లు అయినా దాటొచ్చు.ఒక్క సక్సెస్ ఎంతో ఉత్సాహాన్ని నింపుతోందన్నారు. మారుతోన్న కాలానికి అనుగుణంగా శ్రోతలు కూడా కొత్త తరహా సంగీతాన్ని ఆస్వాదించడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ఇది తమలాంటి యంగ్ మ్యుజీషియన్లకు పెద్ద వరమని కయాన్ అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం భారతీయ స్వతంత్ర సంగీతం ప్రత్యేక అస్తిత్వాన్ని సృష్టించుకుందని అంతా నమ్ముతున్నారు. వెస్ట్రన్ మ్యూజిక్‌ను అనుకరణతో పాటు, మూలాలను మర్చిపోకుండా కొత్తదనాన్ని జోడించడం వల్లే ఇండి మ్యూజిక్ ముమెంటం అందుకుందన్నారు.భవిష్యత్తులో ఈ రంగం మరిన్ని శిఖరాలను అధిరోహిస్తుందని సినిమా సంగీతంతో సమానంగా ఇండి మ్యూజిక్ కూడా రాజ్యమేలుతుందని అభిప్రాయపడ్డారు. కయాన్ వంటి కళాకారులు చూపిస్తున్న తెగువ , సృజనాత్మకత భారతీయ సంగీత రంగాన్ని కొత్త పుంతలు తొక్కిస్తోంది.



పూజిత పొన్నాడ యొక్క ప్రకాశవంతమైన కొత్త లుక్ సోషల్ మీడియాలో హృదయాలను గెలుచుకుంది

Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publications D.No: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Prakasam, Andhra Pradesh - 523001 And Published At published at D V RAO, FLAT NO: 402, VIGNESWARA PRANATHI REDDY TOWERS, OPP. BHARAT PETROLBUNK, VIDYANAGAR, TIRUPATI Dist.,editor GANTYADA APPARAO. PRGI Registration No. "APTEL/25/A4409" e-mail :editorpenpower@gmail.com, Mobile: 9059465965